PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 229 | విజయవాడ, ఆదివారం 24 మార్చి 2024 | 8 + 8 పేజీలు +స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 24 March 2024 | Rs

యువతరం మేల్కోవాలి

- కార్పొరేట్ శక్తుల నుండి దేశాన్ని కాపాడాలి
- డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి
- భగత్ సింగ్ వర్ధంతిలో వి.శ్రీనివాసరావు

3



కర్రన్ కేక...

- ఢిల్లీపై నాలుగు వికెట్ల తేడాతో పంజాబ్ గెలుపు

8



సుధాకర్ (ఫైల్ ఫొటో)

హత్య చేసిన వారిపై కేసు నమోదు చేయాలంటూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సుధాకర్ బంధువులు, స్నేహితులు

ఆప్ ఆఫీస్‌కు సీల్

జాతీయ పార్టీ కార్యాలయానికి వచ్చేందుకు ఆంక్షలా? • పోలీసుల చర్యపై ఆప్ మంత్రుల ఆగ్రహం

- బిజెపి ఖాతాలో మద్యం పాలసీ కేసు నిందితుడి డబ్బు
- నడ్డాను అరెస్ట్ చేయాలి: అతిషి
- కేజ్రీవాల్ పిటిషన్‌పై అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టైన తర్వాత ఆప్ నేతల నిరసనలు మిన్నంటాయి. కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీ లక్ష్యంగా ఆప్ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఎక్కడికక్కడే ఆందోళనలు జరుగుతున్నాయి. ఆప్ మంత్రులను అధికార నివాసాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆ పార్టీ నేత, మంత్రి సౌరభ్ భరద్వాజ్ ధ్వజమెత్తారు. లోక్‌సభ ఎన్నికల వేళ ప్రజల్లోకి వెళ్లేందుకు అడ్డుకోవడం సరికాదని అన్నారు.. 'మిస్టర్ మోడీ మమ్మల్ని కాల్చేయండి' అంటూ సౌరభ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఢిల్లీలో రౌడీయిజం మొదలైంది. పోలీసుల చర్యలో అర్థమవుతోంది. ఇక్కడ శాంతి భద్రతలు అమల్లో లేవు. మీరు మమ్మల్ని పార్టీ ఆఫీసు వెళ్లేందుకు అడ్డుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము ఎలా పోటీ చేయాలి..? తమను నియంత్రించే అధికారం పోలీసులకు ఎక్కడిది? తమ పార్టీ నేతలపై జరుగుతున్న వివక్ష గురించి కేంద్ర ఎన్నికల సంఘం కలుగజేసుకోవాలి. ఇదే అంశం గురించి మాట్లాడేందుకు సమయం ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరాం. ఢిల్లీలో పోలీసుల దూకుడుపై ఈసి చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాం అని' సౌరభ్ భరద్వాజ్ అన్నారు. పార్టీ కార్యాలయానికి సీల్ వేయడం ఏంటి అని మంత్రి అతిషి మండిపడ్డారు. ఇది రాజ్యాంగాన్ని విస్మరించడమేనని విరుచుకుపడ్డారు. ఓ జాతీయ పార్టీ కార్యాలయం వద్దకు వచ్చేందుకు ఆంక్షలు విధిస్తారా..? ఇదే అంశంపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘాన్ని సమయం కోరామని అన్నారు.

కేజ్రీవాల్ పిటిషన్ అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కోరారు. తన అరెస్టు చట్ట విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. హెూలీ పండుగ నేపథ్యంలో ఈ నెల 26 వరకు కోర్టుకు సెలవులు. గనుక బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది.

బిజెపి ఖాతాలో మద్యం పాలసీ కేసు నిందితుడి డబ్బు: నడ్డాను అరెస్ట్ చేయాలి

మద్యం పాలసీ కేసు నిందితుడి డబ్బు బిజెపి ఖాతాలోకి వెళ్లిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆరోపించింది. ఎలక్టోరల్ బాండ్లుగా ఆయన నుంచి కోట్లాది డబ్బు తీసుకున్న బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాను అరెస్ట్ చేయాలని ఆప్ మంత్రి అతిషి డిమాండ్ చేశారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితోపాటు దర్యాప్తు సంస్థల తీరుపై ఆమె మండిపడ్డారు. ఈ కేసుపై రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్న సిబిఐ, ఈడి ఇప్పటి వరకు అరెస్ట్ చేసిన ఏ ఆప్ నాయకుడి నుంచి డబ్బుకు సంబంధించిన ఆధారాలు చూపించలేకపోయాయని అతిషి తెలిపారు. ఈ రెండేళ్లలో మనీ జాడ ఎక్కడ? డబ్బు ఎక్కడికి పోయింది? అన్న ప్రశ్నలు మళ్లీ మళ్లీ వస్తున్నాయని అన్నారు. ఆప్‌కు చెందిన ఏ నేత, మంత్రి, కార్యకర్త నుంచి ఎలాంటి డబ్బును దర్యాప్తు సంస్థలు స్వాధీనం చేసుకోలేదని ఆమె గుర్తు

మిగతా 7లో





పోలీసులు సీజ్ చేసిన ఆప్ కార్యాలయం, పార్టీ కార్యాలయానికి వెళ్లకుండా మంత్రి అతిషిని అడ్డుకుంటున్న పోలీసులు

దళితుని హత్య!

- మృతదేహం డోర్‌డెలివరి
- చిత్తూరు జిల్లాలో దారుణం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

గ్రానైట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న దళితుడిని యజమానే హత్య చేసి, మృత దేహాన్ని డోర్ డెలివరి చేసిన ఉదంతం ఇది! చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు మండలం పాచిగుంటలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుని బంధువులు, స్నేహితులు ఆందోళన చేయడంతో కేసు నమోదు చేశారు. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానిని, మృతదేహాన్ని డోర్‌డెలివరి చేయడానికి సహకరించిన ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ (51) చిత్తూరు పారిశ్రామికవాడలోని ఓ గ్రానైట్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. గ్రానైట్ కంపెనీ యజమాని నాగరాజు శుక్రవారం సుధాకర్ ఇంటికి వచ్చాడు. మాట్లాడే పని ఉందంటూ ఉదయం 8.30 గంటల సమయంలో ఆయనను బయటకు తీసుకెళ్లాడు. అదే రోజు సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో ఒక ఆటోలో సుధాకర్ మృతదేహాన్ని తీసుకొచ్చి ఇంటి వద్ద పడేసి పరారయ్యాడు. ఈ సంఘటనతో ఆయన కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు.. మృతదేహాన్ని శనివారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి అక్కడి పోలీస్ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రానైట్ కంపెనీ యాజమానే హత్య చేశాడంటూ ఆస్పత్రి ఎదుట, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట సుధాకర్ బంధువులు, స్నేహితులు ఆందోళనకు దిగారు. ఆయనపైనా, ఆటోడ్రైవర్ రఘుపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు పోలీసులు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు నాగరాజుపైనా, ఆటో డ్రైవర్ రఘుపైనా కేసు నమోదు చేశామని, వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని చిత్తూరు వన్‌టౌన్ సిఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

లూలాను ఈ రొంపిలోకి లాగుతారా? 7

ఎలుగుబంటి దాడిలో ఇద్దరు మృతి

- మహిళకు తీవ్ర గాయాలు
- న్యాయం చేయాలని మృతదేహాలతో ఆందోళన

3

రూపాయి రికార్డు పతనం

- దేశ చరిత్రలోనే తొలిసారి
- మోడీ పాలనలో భారత కరెన్సీ విలవిల

3

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- ఇద్దరు మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శనివారం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ ఎస్‌పి జితేంద్ర కుమార్ కథనం ప్రకారం... బీజాపూర్‌లోని పిడియ అటవీ ప్రాంతంలో బీజాపూర్, సుక్మా, దంతెవాడలకు చెందిన డిఆర్‌జి, బస్తర్ ఫైటర్, కోబ్రా దళాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఇరుపక్షాల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది. మావోయిస్టుల మృతదేహాలను తరలించే సమయంలో అప్పటికే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో ఇద్దరు పోలీసులు (బస్తర్ ఫైటర్లు)కు గాయాలయ్యాయి. వారిని హెలికాప్టర్‌లో రాయపూర్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఆపరేషన్‌లో దంతెవాడ ఎస్‌పి గౌరవ్ రాయ్, సుక్మా ఎస్‌పి కిరణ్ శహ్వాన్ పాల్గొన్నారు.

తక్షణమే కాల్పుల విరమణ

- ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి గుటెరస్ పిలుపు
- గాజా సరిహద్దుల్లో పర్యటన



మాట్లాడుతున్న గుటెరస్

గాజా : గాజాతో ఈజిప్ట్‌కు గల సరిహద్దుల్లో ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెరస్ శనివారం పర్యటించారు. గత ఐదు మాసాలకు పైగా యుద్ధంతో అతలాకుతలమవుతున్న గాజా ప్రజలకు ఉపశమనం కలిగించేలా కాల్పుల విరమణ తక్షణమే జరగాలని ఆయన పిలుపిచ్చారు. దక్షిణ గాజా నగరమైన రఫాలో సైనిక ఆపరేషన్ చేపడతామంటూ ఇజ్రాయిల్ బెదిరిస్తున్న నేపథ్యంలో గుటెరస్ పర్యటన జరుగుతోంది. ఇటువంటి దాడులు వద్దంటూ అంతర్జాతీయంగా విజ్ఞప్తులు వస్తున్నప్పటికీ ఇజ్రాయిల్ వాటిని బేఖాతరు చేస్తోంది. గాజాలోని 23 లక్షల మంది ప్రజల్లో మెజారిటీ భాగం రాఫా చుట్టుపక్కలనే ఆశ్రయం పొందుతున్నారు. ఉత్తర గాజాలో అక్కడి ప్రజల ఆకలి కేకలతో పరిస్థితులు మరింత దయనీయంగా వున్నాయి. ఈజిప్ట్‌లోని ఉత్తర సినాయ్ ప్రాంతంలో అల్ అరిష్ వద్దకు గుటెరస్ శనివారం చేరుకున్నారు. ఈ ప్రాంతంలోనే అంతర్జాతీయ సాయం పెద్ద మొత్తంలో పేరుకపోయి వుంది. ప్రాంతీయ గవర్నర్ మహ్మద్ సుషా యుఎన్ చీఫ్‌కు స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ, గాజా ప్రజలకు సాయమందించడానికి ఉత్తర సినాయ్‌లో దాదాపు 7వేల ట్రక్కులు వేచి చూస్తున్నాయని చెప్పారు. కానీ ఇజ్రాయిల్ డిమాండ్ చేస్తున్న విధంగా సోదాలు, తనిఖీలతో సాయం అందాల్సిన వారికి అందకుండా నిలిచిపోయిందని అన్నారు. ఈ మేరకు సుషా కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. గాజా నుండి పారిపోయిన పాలస్తీనియన్లు చికిత్స పొందుతున్న అల్ అరిష్ ఆస్పత్రిని కూడా గుటెరస్ సందర్శించనున్నారు. రంజాన్ మాసంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని అందరూ ఆశించినా అది జరగలేదు. దాంతో గాజాలో మానవతా పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా, కతార్ సహా పలు దేశాలు విమానాల ద్వారా ఆహారాన్ని జారవిడుస్తున్నాయి.



ఉల్లి ఎగుమతులపై నిషేధం పొడిగింపు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని పొడిగించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందని పేర్కొంది. గతేడాది డిసెంబర్‌లో ఈ ఏడాది మార్చి 31 వరకు నిషేధం విధించిన విషయం తెలిసిందే. అత్యధికంగా ఉల్లి ఉత్పత్తవుతున్న మహారాష్ట్రలో 2023 డిసెంబర్‌లో ఎగుమతులపై ఆంక్షలతో క్వింటాల్ ధర రూ.4,500 నుంచి రూ.1,200 పడిపోయింది. ప్రస్తుత సీజన్‌లో ఉల్లి ఎగుమతులపై నిషేధం ఎత్తివేస్తారని భావించిన వ్యాపారులు తాజా నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉల్లి ధరలు పెరిగితే ప్రజల నుంచి సార్వత్రిక ఎన్నికల్లో వ్యతిరేకత వస్తుందనే ఉద్దేశంతోనే నిషేధాన్ని కొనసాగించాలని ప్రభుత్వ వర్గాలు భావించాయని సమాచారం. బంగ్లాదేశ్, మలేషియా, నేపాల్, యుఎఇ దేశాలు భారత్ నుంచి అధికంగా ఉల్లి దిగుమతి చేసుకుంటున్నాయి. 2022-23లో భారత్ 2.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉల్లిపాయలను ఎగుమతి చేసింది.

బిల్లుల ఆమోదంలో..

రాష్ట్రపతి, గవర్నర్ జాప్యం

సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ ప్రభుత్వం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళ శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోద ముద్ర వేయకుండా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్ అనుచితమైన జాప్యాన్ని కొనసాగిస్తుండటంపై కేరళలోని వామపక్ష ప్రభుత్వం మరోమారు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. శాసనసభ ఆమోదించిన నాలుగు బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా అకారణంగా తొక్కిపెట్టారని, అలాగే రాష్ట్ర గవర్నరు ఏడు బిల్లులను రెండేళ్లపాటు అకారణంగా పెండింగ్‌లో ఉంచారని రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రధానంగా రాష్ట్ర గవర్నరు చర్యలు 'ఏకపక్షం'గా ఉన్నాయని పేర్కొంది. బిల్లులను అనుచితరీతిలో తొక్కిపెట్టడాన్ని 'రాజ్యాంగ విరుద్ధమైన, చిత్తశుద్ధి లేని' చర్యలుగా ప్రకటించాలని ఆ పిటిషన్‌లో విన్నవించింది.' కేంద్ర మంత్రి మండలి సలహా మేరకు రాష్ట్రపతి నడుచుకుంటారు. బిల్లులో ఏమైనా మార్పులు అవసరమనుకుంటే రాష్ట్రపతి సలహా ఇవ్వచ్చు. గవర్నర్ కూడా రిజర్వ్ చేసిన ఏడు బిల్లుల్లో నాలుగు బిల్లుల ఆమోదాన్ని నిలుపుదల చేయడానికి ఎటువంటి కారణం చెప్పలేదు. ఇది అత్యంత ఏకపక్ష చర్య. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 200, 201లను ఉల్లంఘిస్తుంది" అని తన రిట్ పిటిషన్‌లో కేరళ పేర్కొంది."రెండేళ్లపాటు బిల్లులను పెండింగ్‌లో ఉంచడంలో గవర్నర్ చర్య రాష్ట్ర శాసనసభ పని తీరును దెబ్బతీసింది. దాని ఉనికిని అసమర్థంగా మార్చింది. వీటిలో ప్రజా ప్రయోజనాల కోసం ఉద్దేశించిన బిల్లులు ఉన్నాయి. ఆర్టికల్ 200కి సంబంధించిన నిబంధన ప్రకారం గవర్నర్ 'వీలైనంత త్వరగా' వ్యవహరించకపోవడం వల్ల ఇవి కూడా పనికిరాకుండా పోయాయి" అని ప్రభుత్వం పేర్కొంది. సుప్రీం కోర్టు సూచన తరువాత, గవర్నర్ ఒక బిల్లుకు ఆమోదం తెలిపారని, మరో ఏడు బిల్లులను రాష్ట్రపతికి నివేదించారని, ఆ తరువాత, వాటిలో నాలుగింటికి రాష్ట్రపలి సమ్మతిని నిలుపుదల చేశారని పేర్కొంది. రాష్ట్రపతికి బిల్లులు పంపేటప్పుడు తన వద్ద 11 నుండి 24 నెలల వరకు బిల్లులను పెండింగ్‌లో ఉంచుకున్న విషయాన్ని గవర్నరు ఎక్కడా ప్రస్తావించలేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. "దీనిని ప్రస్తావించినట్లయితే, ఆర్టికల్ 200కి సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా, బిల్లులపై 'వీలైనంత త్వరగా' రాష్ట్రపతి నిర్ణయం తీసుకునేవారు అని పేర్కొంది.

స్థానిక సంస్థల్లో డిజిటల్ చెల్లింపులే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



స్థానిక సంస్థలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకుగాను డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అమలులోకి తీసుకురానున్నారు. గత నెల్లోనే దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం తాజాగా తుది నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిసింది. ఇతర శాఖల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేసేందుకు ఆలోచన చేసినప్పటికీ ముందుగా పంచాయితీరాజ్, మున్సిపల్ శాఖల్లోని స్థానిక సంస్థల కార్యాలయాల్లో, రెవెన్యూ కార్యాలయాల్లో దీనిని అమలు చేయనున్నారు. తాజాగా బ్యాంకర్లతో జరిగిన జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

రిజర్వ్‌బ్యాంకు నుంచి కూడా ఇదే అంశంపై రాష్ట్రాలకు స్పష్టమైన సూచనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మూడు కీలక శాఖల్లో డిజిటల్ చెల్లింపులపై నిర్ణయం తీసుకుంది. మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయితీలు, నగర పంచాయితీలు వంటి స్థానిక సంస్థలతోపాటు, రెవెన్యూ కార్యాలయాల్లో కూడా డిజిటల్ చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు దిశానిర్దేశం చేసింది. రిజర్వ్‌బ్యాంకు ఆధీనంలో ఉన్న భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ (బిబిపిఎస్) ద్వారా ఈ చర్యలు తీసుకోవాలన్న ఆర్‌బిఐ సూచనల మేరకు వ్యవహరించాలని పేర్కొంది. ఇందులో భాగంగానే ఆయా శాఖల్లో క్యూఆర్ కోడ్‌లను, పోస్ మిషన్లను ఏర్పాటుచేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికోసం ఆయా శాఖలకు బ్యాంకర్లు కూడా సహకరించాలని ఆర్‌బిఐ జనరల్ మేనేజర్ సూచించారు.

కార్యాలయాల్లో పోస్ మిషన్లు, క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటుచేసారా లేదా అన్నది కూడా బ్యాంకులు గుర్తించాలని నిర్దేశించారు. ఈ ప్రక్రియ అందుబాటులోకి వస్తే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

మాస్కోలో ఉగ్రదాడి ఉక్రెయిన్ పనే : పుతిన్

- 133కు మృతుల సంఖ్య

మాస్కో : రష్యా రాజధాని మాస్కోలోని క్రాకస్ సిటీ హాల్‌లో శుక్రవారం జరిగిన ఉగ్రవాద దాడి వెనుక ఉక్రెయిన్ ప్రమేయముందని రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. శనివారం ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. మాస్కోలోనూ, మాస్కో పరిసర ప్రాంతాల్లోనూ అదనంగా తీవ్రవాద నిరోధక చర్యలు చేపట్టామని, ప్రజలు భయాందోళనలకు గురికావద్దని కోరారు. ఈ దాడికి పాల్పడిన నలుగురితో సహా 11 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిలో నలుగురు ఉక్రెయిన్‌లోకి పారిపోయేందుకు ఏర్పాట్లు కూడా చేసినట్లు వెల్లడైందని, దీంతో ఉక్రెయిన్ హస్తం బయటపడిందని చెప్పారు. తీవ్రవాదులకు ఆయుధాలు ఎవరు అందచేశారు, వారికి వాహనాలు ఎవరు సమకూర్చారు, తప్పించుకుని పోయే మార్గాలను ఎవరు సిద్ధం చేశారు వంటి వివరాలను గుర్తించేందుకు దర్యాప్తు అధికారులు ప్రయత్నిస్తున్నారని పుతిన్ తెలిపారు. మాస్కోపై ఉగ్రవాద దాడిలో మృతుల సంఖ్య 133కి చేరిందని, 150 మందికిపైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. దాడిలో భవన శిథిలాల నుండి మరిన్ని మృతదేహాలను అత్యవసర సహాయ బృందాలు వెలికితీస్తున్నాయని చెప్పారు. ఈ దాడికి తమదే బాధ్యత అని ఇస్లామిక్ స్టేట్ గ్రూపు ప్రకటించింది.

రెవెన్యూ నిర్వాకానికి కుటుంబం బలి

- రైలు కింద పడి భర్త.. ఉరేసుకుని భార్య, కుమార్తె

ప్రజాశక్తి-ఒంటిమిట్ట (వైఎస్ఆర్ జిల్లా)

రెవెన్యూ అధికారుల నిర్వాకానికి నిండు కుటుంబం బలైంది. భర్త రైలు కింద పడి ఆత్మహత్య చేసుకోగా, భార్య, కుమార్తె ఉరేసుకుని మరణించారు. సంఘటన స్థలంలో దొరికిన సూసైడ్ నోట్‌లో రెవెన్యూ అధికారులు మోసం చేశారని, ఏమి చేయలేని స్థితిలో చనిపోతున్నామని రాసి ఉండటం కలకలం రేపింది. వైఎస్ఆర్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం గ్రామంలో శనివారం జరిగిన ఈ సంఘటన ఆ ప్రాంతమంతా కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు.. కొత్త మాధవరానికి చెందిన పాల సుబ్బారావు (47) చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఒంటిమిట్ట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 2185/2లో మూడెకరాల భూమి ఉంది. ఆ భూమిని అమ్ముదామని ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో రికార్డులు తారుమారు చేశారు. కట్టా శ్రావణి అనే పేరుపై ఆన్‌లైన్‌లో నమోదై కనిపించింది. మార్చడానికి రెవెన్యూ అధికారుల చుట్టూ రెండు సంవత్సరాల పాటు తిరిగినా ఫలితం కనిపించలేదు. దీంతో మనస్థాపం చెందిన సుబ్బారావు, అతని భార్య పద్మావతి (41), కుమార్తె వినయ (17) ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఉదయం తల్లీకూతుళ్లు ఇంట్లోనే ఉరేసుకుని మృతిచెందారు. పాల మనిషి వచ్చి తలుపు తట్టగా ఎవరూ తీయకపోవడంతో అతను స్థానికులకు తెలియజేశాడు. వారు తలుపు తీసి చూడగా తల్లీకూతుళ్లు ఉరేసుకుని కనిపించారు. అప్పటికే ప్రాణాలు పోయి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుబ్బారావు ఒంటిమిట్ట చెరువు దగ్గర ఉన్న రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న సిఐ పురుషోత్తమరాజు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ట్రాక్‌పై సుసైడ్ నోట్ లభించింది. కడప డిఎస్‌పి షరీఫ్ కొత్తమాధవరంలోని మృతుల ఇంటిని పరిశీలించారు. ఆత్మహత్యలపై స్థానికులతో ఆరా తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. రికార్డులను సరిచేయడానికి రెవెన్యూ అధికారులు పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారని మృతుల బంధువులు చెబుతున్నారు. సుబ్బారావు దంపతులకు మరో కుమార్తె కూడా ఉంది. ఆమె హైదరాబాద్‌లో చదువుకుంటున్నట్లు సమాచారం.



ఆత్మహత్యకు పాల్పడిన దంపతులు (ఫైల్)

ప్రభుత్వ దాష్టీకానికి బలి : బాబు

వైసిపి ప్రభుత్వ దాష్టీకానికి చేనేత కుటుంబం బలైందని చంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది ద్వారా వైసిపి నాయకులు చేసిన అధికారిక కబ్జా నిండు కుటుంబం ఉసురు తీసిందని పేర్కొన్నారు. రికార్డుల్లో పేర్లు మార్చి వైసిపి భూ బకాసురులతో పోరాడలేక పేద బిసి కుటుంబం బలవంతంగా ప్రాణాలు తీసుకుందని తెలిపారు. మాటలకు అందని ఈ విషాదం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ ఆందోళనలో పడేస్తోందని పేర్కొన్నారు. కడప జిల్లాలో చోటు చేసుకున్న ఈ దారుణంపై ఏ సమాధానం చెబుతారని సిఎం జగన్‌ను ప్రశ్నించారు.

గవర్నర్‌కు స్వల్ప అస్వస్థత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. మణిపాల్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. సాధారణ మెడికల్ చెకప్‌లో భాగంగానే మణిపాల్ ఆసుపత్రిలో శనివారం అడ్మిట్ అయినట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం ఉదయం ఎండోస్కోపీ టెస్టులు నిర్వహించిన అనంతరం గవర్నర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ కానున్నట్లు సమాచారం.

జగన్‌కు ఓటడిగే హక్కు లేదు

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని నాశనం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచమంతా డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం తాపత్రయపడుతుంటే జగన్ రాష్ట్రాన్ని డ్రగ్స్ క్యాపిటల్ చేస్తున్నారని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్రెజిల్ నుంచి 25 వేల కిలోల డ్రగ్స్ కంటైనర్ వచ్చిందంటే రాష్ట్రంలో ఏం జరుగుతోందని తెలిపారు. సిబిఐ అధికారులను రాష్ట్ర పోలీసులు నిలువరించడం వెనుక సిఎం హస్తం ఉందని ఆరోపించారు. నెల్లూరు వాసిగా చెప్పుకునే విజయసాయిరెడ్డి జిల్లాకు ఏం చేశారని ప్రశ్నించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్ కుట్ర పన్నుతున్నారని టిడిపి నాయకులు చమర్తి జగన్మోహనరాజు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడప జిల్లాలో బిసి చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన మూడెకరాల భూమి వైసిపికి చెందిన నాయకులు లాక్కోవడంతో మొత్తం కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

తెలంగాణ నుంచే కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం

- ఏప్రిల్ మొదటి వారంలో తుక్కుగూడలో బహిరంగ సభ
- హాజరుకానున్న రాహుల్, ఖర్గే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికార కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం నుంచే దేశ వ్యాప్త ఎన్నికల శంఖారావాన్ని పూరించనుంది. ఏప్రిల్ మొదటి వారంలో రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో భారీ బహిరంగ సభను నిర్వహించనుంది. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కాంగ్రెస్ ఏర్పాటు చేస్తున్న మొదటి సభ ఇదే కావడంతో ఆ పార్టీ దాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అదే వేదిక నుంచి తన మేనిఫెస్టోను విడుదల చేయనుంది. ఇప్పటికే దేశ ప్రజల కోసం కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీల భరోసా ఇవ్వనుంది. ఈ సభకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతోపాటు పార్టీ సీనియర్ నాయకులు హాజరుకానున్నారు. అందుకు సంబంధించిన కసరత్తును సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించినట్టు తెలిసింది. తుక్కుగూడలో నిర్వహించే సభకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ జనసమీకరణకు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా నాయకులతో రేవంత్ మాట్లాడినట్టు తెలిసింది. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఈ సభకు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల సమరంలో అత్యధిక సీట్లలో గెలుపే లక్ష్యంగా పని చేయాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సభను విజయవంతం చేయడానికి నేతలు కష్టపడి పని చేయాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులు తుక్కుగూడ మైదానాన్ని సందర్శించారు.

పబ్లిక్ సెక్టార్‌ను ధ్వంసం చేస్తున్న బిజెపిని ఓడించండి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
- విశాఖలో జిఐఇఎ 17వ జనరల్ కాన్ఫరెన్స్



జిఐఇఎ 17వ జనరల్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

దేశంలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, దేశానికి అన్ని విధాలుగా ఆదాయం సమకూరుస్తున్న పబ్లిక్ సెక్టార్‌ను ధ్వంసం చేస్తోన్న బిజెపిని, దాని మిత్రపక్షాలను, పరోక్షంగా మద్దతు ఇస్తున్న పార్టీలను రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కోరారు. విశాఖలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ వైజాగ్ రీజియన్ 17వ జనరల్ కాన్ఫరెన్స్ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను పూర్తిగా మార్చివేసి కార్మికులకు హక్కులు లేకుండా చేస్తోందన్నారు. ప్రధాని మోడీ అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పారని,పది సంవత్సరాలు అయినప్పటికీ ఈ రెండు విషయాల గురించి ప్రధాని ప్రస్తావించడం లేదని విమర్శించారు. రైతాంగాన్నీ మోడీ సర్కారు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ క్రమంలో కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాలని కోరారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్లను ప్రోత్సహిస్తూ, వారికి అనేక రాయితీలు కల్పిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను వారికి ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) ఉపాధ్యక్షులు జి.ఆనంద్, జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సౌత్ జోన్ అధ్యక్షులు వై.సుబ్బారావు మాట్లాడుతూ.. నేషనల్ ఇన్సూరెన్స్, న్యూ ఇండియా, ఓరియంట్, యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ వంటి సాధారణ బీమా కంపెనీలను బలోపేతం చేయాలంటే, వాటన్నింటినీ విలీనం చేసి ఎల్ఐసి లాగా ఒక కంపెనీగా మార్చాలని అన్నారు. ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలు 1971లో జాతీయం కాబడినప్పటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా ఏడు వేలకుపైగా కార్యాలయాలు కలిగి ప్రజలకు తక్కువ రేట్లలో పాలసీలు అందిస్తున్నాయన్నారు. సామాజిక సంక్షేమం ధ్యేయంగా పేదవారికి అనేక పాలసీలను అమలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని బలోపేతం చేయడం మానేసి కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు కంపెనీలను ప్రోత్సహించడం సరికాదన్నారు. ప్రయివేట్ కంపెనీలు ప్రజలపై భారాలు వేస్తూ ప్రీమియం ఎక్కువగా వసూలు చేస్తాయని తెలిపారు. పై నాలుగు సాధారణ ప్రభుత్వ బీమా రంగ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు చాలాకాలంగా వేతన సవరణ చేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్.రామకృష్ణ ప్రసాద్, కెయువిఎస్ఆర్.మూర్తి, గణేష్ పాల్గొన్నారు. పలు జిల్లాల ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ఖర్చు చేస్తే చర్యలు తీసుకోవాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో పికె డాష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల కమిషన్ నిర్దేశించిన వ్యయ పరిమితికి మించి అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చు చేస్తే వారిపై వేటు పడేటట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టాలని కేంద్ర ఎన్నికల వ్యయాల పూర్వ డైరెక్టర్ జనరల్ పికె డాష్ పేర్కొన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవభవన్‌లో "స్వేచ్ఛాయుత ఎన్నికలు -అవినీతికి అడ్డుకట్ట" అనే అంశంపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మధుకోడ (జార్ఖండ్), అశోక్ చౌహాన్ (మహారాష్ట్ర), నరోత్తం మిశ్రా (మధ్యప్రదేశ్), ఊర్మిళ జాదెబ్ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన వ్యయపరిమితిని మించి ఖర్చు చేసినట్లు రుజువు కావడంతో గతంలో కేంద్ర ఎన్నికల కమిషన్ వారి సభ్యత్వాలను రద్దు చేసిందన్నారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ పేర్కొన్న వ్యయానికి కనీసం 100 రెట్లు ఖర్చు పెడుతున్నా ఏ ఒక్కరినీ తొలగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పౌర సంస్థలు ముందుకు వచ్చి అభ్యర్థుల వ్యయాలపై రుజువులతో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు మూడు లక్షల మంది వాలంటీర్లు కొనసాగుతున్నారని, వీరందరూ అధికార పార్టీకి లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. సి విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఎన్నికల అక్రమాల ఫిర్యాదు చేస్తే వంద నిమిషాలలోపే చర్యలు ఉంటాయన్నారు, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ వాలంటీర్లు, బూత్‌లెవల్ ఆఫీసర్ల అక్రమాల ఫలితంగా ఓటర్ల జాబితా లోపభూయిష్టంగా ఉందన్నారు. అర్హత కలిగి ఓటు పొందని వారు ఏప్రిల్ 15 వరకు ఓటర్లుగా నమోదు అయ్యే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. మాజీ పార్లమెంట్ సభ్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ టిఎన్ శేషన్ ఎన్నికల చీఫ్‌కమిషనరుగా ఉన్న సమయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమలైందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర మాజీ మేయరు జంధ్యాల శంకర్, ఆదాయపు పన్ను పూర్వ కమిషనరు పి.రఘు, పౌరసంస్థల నేతలు గోళ్ల నారాయణరావు, సి.భాస్కర్‌రావు, కొలనుకొండ శివాజీ, రావి శారద, పి.మల్లికార్జునరావు, పద్మశేఖర్, సీనియర్ జర్నలిస్ట్ డాని, కెఎల్ యూనివర్శిటీ లా విద్యార్థులు పాల్గొన్నారు.

పోలవరం సమస్యల పరిష్కారానికి కృషి

- పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ కూటమి గెలిచి, అధికారంలోకి వస్తే పోలవరం నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో శనివారం పోలవరం నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం జనసేన నాయకులు చిర్రి బాలరాజుకు ఎన్నికల నియమావళి, నిబంధనలతో కూడిన పత్రాలను పవన్‌కల్యాణ్ అందజేశారు. ఈ సమావేశంలో కరాటం రాంబాబు, గడ్డమణుగు రవికుమార్, కరాటం సాయి చంద్రమోహన్ పాల్గొన్నారు.

పి.గన్నవరంలో సత్తా చాటాలి : పవన్‌కల్యాణ్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటిన విధంగానే రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ సత్తా చాటాలని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. పి.గన్నవరం నియోజకవర్గ నేతలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పి.గన్నవరం ఇన్‌ఛార్జి గిడ్డి సత్యనారాయణకు ఎన్నికల నియమ నిబంధనలతో కూడిన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు, ఉపాధ్యక్షులు బి.మహేందర్‌రెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కల్యాణం శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఓటర్‌ను కలవండి

- టిడిపి వర్క్‌షాపులో చంద్రబాబు నాయుడు
- రాష్ట్రాన్ని డ్రగ్స్ అడ్డాగా మార్చారని విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి ఓటర్‌ను కలవాలని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. టిడిపి ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, పరిశీలకులు, జోనల్ కోఆర్డినేటర్లతో విజయవాడలో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొత్తులో భాగంగా బేషజాలు లేకుండా మూడు పార్టీలు శ్రేణులు కలిసి నడవాలని సూచించారు. ఎన్‌డిఎ కూటమి నిలబెట్టిన ప్రతి అభ్యర్థి గెలుపు లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. బలహీనమైన అభ్యర్థులు ఉంటే మిగిలిన సీట్లపై ఆ ప్రభావం పడుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి అభ్యర్థులను ఎంపిక చేశామని చెప్పారు. పొత్తులో భాగంగా అందరికీ టికెట్లు ఇవ్వలేకపోయామని అన్నారు. రాష్ట్రం గెలవాలి ప్రజలకు న్యాయం జరగాలంటే కొన్ని త్యాగాలు తప్పలేదన్నారు. 31 మంది ముఖ్యనేతలకు సీట్లు ఇవ్వలేకపోయామని అన్నారు.

సీట్లు రాని అభ్యర్థులు మూడు పార్టీల్లో ఉన్నారని, అధికారంలోకి రాగానే వారికి మంచి అవకాశాలు కల్పిస్తామన్నారు. నెల రోజుల్లో మరోసారి సమావేశం ఉంటుందని, ఈ లోపు ఏమాత్రం ఏ మారినా అభ్యర్థులకు ఫోన్లు వస్తాయని చెప్పారు. జగన్ రాష్ట్రాన్ని డ్రగ్స్ అడ్డాగా మార్చారని విమర్శించారు. కూనం వీరభద్రరావు వైసిపి నేత పూర్ణచంద్రరావుకు సోదరుడు అని తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలోనూ వైసిపి నేతలు ఉన్నట్లు వార్తలొస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ముంద్రా పోర్టులో డ్రగ్స్ పట్టుబడ్డాయని, ఇందులో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రమేయముందని చెప్పినా ఇంతవరకూ ఆ కేసు ఏమైందో తెలీదని తెలిపారు.


టిడిపి వర్క్‌షాపులో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

నాలుగు అంశాలపై మేం స్పష్టత ఇవ్వాలి : బిజెపి నేత సత్యనారాయణ

బిజెపి క్రమశిక్షణ కమిటీ ఛైర్‌పర్సన్ పాక సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రప్రజలకు నాలుగు అంశాల్లో తమ పార్టీ స్పష్టమైన వైఖరి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఇవి రాజధాని, పోలవరం, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశాలని చెప్పారు. చిలకలూరిపేట సభ తరువాత ఈ విషయం తమకు అర్థమైందన్నారు. జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ తమ కూటమి పొత్తును చెడగొట్టేందుకు వైసిపి ప్రయత్నిస్తోందని విమర్శించారు.

పలువురు టిడిపిలోకి

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో వివిధ నియోజకవర్గాలకు చెందిన నేతలు టిడిపిలో చేరారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో చేరికల కార్యక్రమం శనివారం జరిగింది. వివిధ నియోజకవర్గాలకు చెందిన కౌన్సిలర్లు, జెడ్‌పిటిసి, సర్పంచులకు పార్టీ కండువా కప్పి చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు నెక్కలి నాగమణి, బననానపల్లె నియోజకవర్గానికి చెందిన చల్లా భాస్కర్ రెడ్డి, కె రామిరెడ్డి, పులివెందుల నియోజకవర్గానికి చెందిన మాజీ జెడ్‌పిటిసి రాధాకృష్ణయ్య, వేంపల్లికి చెందిన జయరామిరెడ్డి, పొద్దుటూరు 19వ వార్డు కౌన్సిలర్ షేక్ మునీర్, మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు తదితరులు పార్టీలో చేరారు. గాండ్ల సామాజికవర్గానికి చెందిన పలువురు ప్రతినిధులు కూడా చంద్రబాబును కలిశారు. దశాబ్దాలుగా తమ సమస్యలు ఆపరిష్కృతంగా ఉన్నాయని వీటిని పరిష్కరించాలని కోరారు.

విశాఖ పోర్టు కంటైనర్ టెర్మినల్‌లో సిబిఐ విచారణ

- సంధ్యా ఆక్వా కంపెనీ ప్రతినిధుల ఇంటరాగేషన్
- సురక్షిత ప్రదేశానికి కంటైనర్ తరలించే ఏర్పాట్లలో అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో పట్టుబడ్డ 25 వేల కిలోల డ్రగ్స్‌కు సంబంధించి సిబిఐ అధికారులు శనివారం విశాఖపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ ఆవరణలో విచారణ జరిపారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ వ్యాపార డాక్యుమెంట్లను పరిశీలించారు. కంటైనర్ అంతర్గత భద్రతపైనా సిబిఐ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. విశాఖపట్నంలో సోదాల అనంతరం పోర్టులోనే సంబంధిత అధికారులు కొంతమంది తిష్టవేసి ఈ వ్యవహారం మూలాలు ఎక్కడున్నాయో పరిశోధించే ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది.

అంతర్గత భద్రత కోసం సిబిఐ చర్యలు

25 వేల కిలోలున్న డ్రగ్స్ వ్యవహారంపైనే రాష్ట్రం, దేశంలో పలువురి దృష్టి ఉన్నందున దీన్ని భద్రపరిచే విషయాలపై సిబిఐ అధికారులు కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), కంటైనర్ ఫ్రైయిట్ స్టేషన్ (సిఎఫ్ఎస్) అధికారులతో పలు దఫాలుగా చర్చలు జరిపారు. సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ కంపెనీకి చెందిన ప్రతినిధులనూ శనివారం పోర్టు ఆవరణంలో కంటైనర్ టెర్మినల్‌లో ప్రశ్నించినట్లు తెలుస్తోంది. సముద్రంపైనే ఈ సరుకు మొత్తం ఉన్నందున దీన్ని సురక్షిత ప్రదేశానికి తరలించే ఏర్పాట్లను సిబిఐ పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాకినాడ, విశాఖపట్నంలోగల సంధ్యా ఆక్వా కంపెనీలోని బుకింగ్ ఆర్డర్లను, డాక్యుమెంట్లన్నిటినీ కంటైనర్ టెర్మినల్‌లోనే కూర్చొని సిబిఐ అధికారులు శనివారం అంతా పరిశీలించారు. శని, ఆదివారాలు సెలవు రోజులే అయినప్పటికీ ఈ డ్రగ్స్ కంటైనర్ ఇంకా ఎటూ తరలిపోకుండా తగు జాగ్రత్తలను సిబిఐ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పోర్టుకు ఈ నెల 19న వచ్చిన తర్వాత సరుకు అన్‌లోడింగ్ జరిగిందన్న ప్రచారం జరిగింది. వాస్తవానికి సరుకును కంటైనర్‌లో ఉండగానే సిబిఐ అధికారులు సీజ్ చేసినట్లు తెలుస్తోంది. డాక్యుమెంట్లన్నింటినీ పరిశీలించే పనితో పాటు సమాంతరంగా ఈ సరుకును అక్కడ ఉంచకుండా వేరే సిఎఫ్ఎస్‌కు తరలించే ఏర్పాట్లలో నిమగ్నమైనట్లు సమాచారం.

అండగా నిలిచే పార్టీలకే మద్దతు

- జయలక్ష్మి సొసైటీ బాధితుల సంఘం నిర్ణయం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

జయలక్ష్మి కో-ఆపరేటివ్ సొసైటీ బాధితులకు అండగా నిలిచే రాజకీయ పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని సొసైటీ బాధిత సంఘం సభ్యులు తెలిపారు. జయలక్ష్మి సొసైటీ యాజమాన్యం ఇష్టానుసారంగా రుణాల మంజూరు చేయడం, సొంతానికి వాడుకోవడం, 19 వేల మందికి చెందిన రూ.582 కోట్ల డిపాజిట్లు కొల్లగొట్టిన సంగతి తెలిసిందే. కోట్లాది డిపాజిట్లు తీసుకుని స్వాహాకు పాల్పడిన జయలక్ష్మి సొసైటీ పాత కార్యవర్గం ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లతోపాటు ఇతర డైరెక్టర్ల ఆస్తులను సిబిసిఐడి అధికారులు సీజ్ చేశారు. నూతన కార్యవర్గం జారీ చేసిన నోటీసులకు లోబడి కొంత మంది రుణ గ్రహీతలు రూ.1.50 కోట్లు చెల్లించారు. ఈ క్రమంలో కాకినాడలోని సర్పవరం జంక్షన్‌లో గల జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ కార్యాలయం ఎదుట బాధిత సంఘం సభ్యులు శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు, అంగర నరసింహారావు, చిప్పల శంకరం, కృష్ణారావు, పల్లంరాజు, రాజగోపాలు మాట్లాడుతూ.. పాత ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లతోపాటూ డైరెక్టర్లను పోలీసులు అరెస్ట్ చేశారన్నారు. అయితే, నూతన పాలకవర్గ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు ఆధ్వర్యంలో నిందితుల ఆస్తులను గుర్తించి న్యాయస్థానం ద్వారా సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. 50 మంది బాధితులు చనిపోతే ప్రభుత్వం నయాపైసా నష్ట పరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. సుమారు 300 కోట్లు స్థిరాస్తులు ఉన్నాయని, అడ్వాన్సుగా బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం రూ.150 కోట్లు ఇవ్వాలని కోరినా పట్టించుకోలేదన్నారు. సీజ్ చేసిన ఆస్తులను విక్రయించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సుమారు 20 వేల మంది బాధితులు ఉన్నారని, ఉమ్మడి విశాఖ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో బాధితుల కుటుంబాలకు చెందిన సుమారు 2 లక్షల ఓట్లు ఉన్నాయన్నారు. బాధితుల సంఘం నుంచి ఒక్కో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపి సత్తా చూపిస్తామని తెలిపారు. జయలక్ష్మి సొసైటీ కార్యకలాపాలు, ఆస్తుల సీజ్, నిందితులకు సమన్లు, ఎఫ్ఐఆర్ నమోదు, స్థిరాస్తుల సీజ్, సేల్ ఆర్డర్ కోసం చట్టబద్ధ, న్యాయబద్ధంగా తీసుకున్న చర్యలపై జయలక్ష్మి సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాధరావు వివరించారు.



కోట జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

డ్రగ్స్ రవాణాదారులను శిక్షించాలి

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖకు తీసుకువచ్చిన డ్రగ్స్ రవాణాదారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విజయనగరం కోట జంక్షన్ వద్ద ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలోకి 25వేల కిలోల డ్రగ్స్ ప్రవేశిస్తే అది ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరి కాదా? అని ప్రశ్నించారు. మాదకద్రవ్యాల బారి నుంచి యువతను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, బి.హరీష్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి , మాదకద్రవ్యాల వాడకం రాష్ట్రంలో విపరీతంగా పెరిగిపోయిందని, నిర్మూలించాల్సిన ప్రభుత్వాలే రవాణాదారులకు అండగా నిలుస్తూ వారికి సహకరించడం దుర్మార్గమన్నారు. ఎప్పుడైతే ఈ కేంద్ర ప్రభుత్వాలు పోర్టులను ప్రయివేటు పరం చేయడం మొదలుపెట్టాయో అప్పటి నుంచి నిషేధిత పదార్థాలు రాష్ట్రంలోని ప్రవేశిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి. రాము, జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ వందేమాతరం గీతాలాపనతో బాలగాయకుడు ధీరజ్ ప్రపంచ రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)


ధీరజ్‌కు భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్ ధ్రువపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ కిరణ్

భారత జాతీయోద్యమ స్ఫూర్తి రగిల్చిన వందేమాతర గీతాన్ని నిర్విరామంగా 77 సార్లు ఆలపించి ప్రపంచ రికార్డు నెలకొల్పారు విశాఖకు చెందిన బాల గాయకుడు దొంతంశెట్టి ధీరజ్. అతని ప్రతిభకు భారత్ టాలెంట్స్ బుక్ అఫ్ రికార్డ్‌లో స్థానం లభించింది. పాడుతా తీయగా, సూపర్ సింగర్ కాంటెస్ట్ విజేతగా నిలిచిన ధీరజ్ తాజాగా ఈ రికార్డు నెలకొల్పారు. శనివార విశాఖలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భారత్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్ ధ్రువపత్రాన్ని ధీరజ్‌కు డాక్టర్ నందవాడ కిరణ్ అందజేసి, ఘనంగా సత్కరించారు. ధీరజ్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో వందేమాతర గీతాన్ని సరైన రీతిలో సంపూర్ణంగా ఆలపించడంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నానని తెలిపారు. 'కలిసి పాడుదాం వందేమాతరం' శీర్షికతో కొన్ని నెలలుగా 40 పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చానన్నారు. ఈ తరుణంలో మదిలో మెదిలిన సంకల్పమే సంపూర్ణ వందేమాతర నిర్విరామ గీతాలాపన అని తెలిపారు. తన తల్లిదండ్రులు రాజేష్, రాణిల ప్రోత్సాహంతో తనకీ గుర్తింపు వచ్చిందని చెప్పారు. అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వి డెంటల్ హాస్పటల్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ మాట్లాడుతూ.. వందేమాతర ఉద్యమ స్ఫూర్తిని పునర్నిర్మించడానికి ధీరజ్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రతినిధి సబ్బవరపు రాజశేఖర్, నాట్యాచార్య కె.వెంకట్, డాక్టర్ ఇ.శ్రీ విద్య, అమ్మా బ్లడ్ బ్యాంకు అధినేత దాసరి శివగుప్తా, వాసవి క్లబ్ ప్రతినిధి కె.అనిల్ కుమార్, వి హెల్త్ కేర్ చీఫ్ మేనేజర్ సిహెచ్.కృష్ణ, కె.రమ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరిప్రసాద్‌రెడ్డి, పక్కన బాధితుడు

క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

- నెల్లూరు నారాయణ వైద్యశాల సూపరింటెండెంట్

ప్రజాశక్తి-నెల్లూరు

క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని నెల్లూరులోని నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం వైద్యశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌జిల్లా జమ్మలమడుగుకు చెందిన గురుస్వామి (57) తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నారని చెప్పారు. దీంతో కుటుంబసభ్యులు తమ ఆస్పత్రికి తీసుకువచ్చారని తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మెదడులో ఐదు ఎన్యురిజంలు (మల్టిపుల్ ఇంట్రాక్రేనియల్ ఎన్యురిజమ్స్) ఏర్పడినట్లు, వాటి కారణంగా రక్తస్రావం జరిగినట్లు గుర్తించామన్నారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టరు సాయికిరణ్ శస్త్రచికిత్స చేసి బాధితుడిని కాపాడారని తెలిపారు. గతంలో నెల్లూరు జిల్లా కురుగొండకు చెందిన ఉష, తోటపల్లి గూడూరుకు చెందిన పి. రమణమ్మకు సైతం ఇదే తరహా శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు.

టిడిపిలో కుటుంబ టికెట్ల లొల్లి

- కుటుంబానికి ఒకటే అన్న అధిష్టానం
- పుట్టా, వేమిరెడ్డి కుటుంబాలకు రెండేసి టిక్కెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టికెట్ల కేటాయింపునకు సంబంధించి పలువురు టిడిపి సీనియర్ నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. టికెట్లివ్వలేదని కొందరు, తమ కుటుంబ సభ్యులకు ఇవ్వలేదని మరికొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీలోని కొంతమంది సీనియర్ నాయకులు తమతోపాటు తమ వారసులకు కూడా టికెట్ ఇవ్వాలని చంద్రబాబును కోరారు. ఈసారి కుటుంబానికి ఒక టికెట్ మాత్రమే ఉంటుందనే నిబంధన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు నేతలకు చెప్పారు. ఈ నిబంధనను పుట్టా సుధాకర్ యాదవ్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబాలకు మినహాయించడంతో మిగిలిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుట్టా సుధాకర్ యాదవ్‌కు కడప జిల్లా మైదుకూరు శాసన సభ సీటును, ఆయన కుమారుడు మహేష్ యాదవ్‌కు ఏలూరు లోక్‌సభ సీటును టిడిపి కేటాయించింది. నెల్లూరు జిల్లాకు చెందిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి నెల్లూరు లోక్‌సభ సీటును, ఆయన భార్య ప్రశాంతి రెడ్డికి నెల్లూరు జిల్లా కోవూరు అసెంబ్లీ సీటు ఇచ్చారు. దీంతో మిగిలిన నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లా నుంచి పరిటాల సునీత, రాప్తాడు నుంచి ఆమె కుమారుడు శ్రీరామ్ ధర్మవరం సీట్లు కోరారు. రాప్తాడు సీటు మాత్రమే ఆ కుటుంబానికి ఇచ్చారు. ఇదే జిల్లా నుంచి జెసి దివాకర్ రెడ్డి తాడిపత్రి శాసనసభ, ఆయన కుమారుడు జెసి అస్మిత్‌రెడ్డి అనంతపురం లోక్‌సభ సీట్లు కోరారు. అస్మిత్‌కు తాడిపత్రి ఇచ్చి దివాకర్ రెడ్డికి ఇవ్వలేదు. కర్నూలు నుంచి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి డోన్ నియోజకవర్గం, ఆయన భార్య సుజాత ఆలూరు ఇవ్వాలని కోరారు. సూర్యప్రకాష్‌కు డోన్ కేటాయించి సుజాతకు మొండిచెయ్యి చూపారు. ఇదే జిల్లా నుంచి కెఇ ప్రభాకర్‌కు డోన్, ఆయన సోదరుడు, మాజీమంత్రి కెఇ శ్యామ్‌బాబుకు పత్తికొండ సీట్లు ఇవ్వాలని కోరారు. శ్యామ్‌బాబుకు మాత్రమే పత్తికొండ కేటాయించారు. విజయనగరం జిల్లాలో మాజీ మంత్రి కిమిడి కళా వెంకట్రావు ఎచ్చెర్ల నుంచి, ఆయన సోదరుడు కుమారుడు (మాజీమంత్రి మృణాళిని) కుమారుడు నాగార్జునకు చీపురుపల్లి ఇవ్వాలని కోరారు. ఈ కుటుంబానికి రెండు కాదు ఒక్కటి కూడా దక్కే పరిస్థితి లేదని నాయకులు చెబుతున్నారు. ఇదే జిల్లా నుంచి మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం సీటుతోపాటు కుమారుడు విజయ్‌కు అనకాపల్లి లోక్‌సభ స్థానం ఇవ్వాలని కోరారు. అయ్యన్నపాత్రుడుకు నర్సీపట్నంతో సరిపెట్టారు. శుక్రవారం ప్రకటించిన మూడో జాబితాలో పుట్టా సుధాకర్ యాదవ్ కుమారుడు మహేష్ యాదవ్‌కు ఏలూరు లోక్‌సభ స్థానం కేటాయించడంపై ఇతర నేతలు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. కుటుంబానికి ఒక టికెటే అన్న పార్టీ పుట్టా కుటుంబానికి రెండు స్థానాలు ఎలా కేటాయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆగ్రహంలో ఉన్నట్లు తెలిసింది. విశాఖలో పట్టుబడ్డ డ్రగ్స్ అంశంపై విలేకరుల సమావేశం పెట్టి స్పందించాలని పార్టీ అయ్యన్నను ఆదేశించినట్లు సమాచారం. తన కుమారుడికి టికెట్ దక్కకపోవడంతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయలేదని తెలిసింది.

యువతరం మేల్కోవాలి

- కార్పొరేట్ శక్తుల నుండి దేశాన్ని కాపాడాలి
- డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి
- భగత్ సింగ్ వర్ధంతిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు


నివాళర్పించిన అనంతరం మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశాన్ని కార్పొరేట్ శక్తులు, డ్రగ్స్ మాఫియా కమ్మేశాయని, విప్లవ యోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో వాటికి వ్యతిరేకంగా యువతరం పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విముక్తి కోసం ఆనాడు భగత్‌సింగ్ అలుపెరుగని పోరాటం నిర్వహించారని తెలిపారు. వారి త్యాగంతో దేశానికి విముక్తి లభించిందని, కానీ నేడు సామ్రాజ్యవాదుల చేతుల్లో దోపిడీకి గురవుతోందని తెలిపారు. పాలకులు కూడా వారికి తొత్తులుగా మారి దేశాన్ని దోచుకుతింటున్నారని విమర్శించారు. మరోవైపు డ్రగ్ మాఫియా విచ్చలవిడిగా విస్తరిస్తోందని అన్నారు. ఇదే కొనసాగితే యువత నిర్వీర్యం అవుతుందని హెచ్చరించారు. యువతరం మేలుకోవాలని కార్పొరేట్ శక్తుల నుండి దేశాన్ని కాపాడాలని, డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. విశాఖ పోర్టులో దొరికిన డ్రగ్స్ మార్కెట్లోకి వెళితే మరో పదేళ్లలో యువత పూర్తిగా పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని తెలిపారు. దీన్ని అడ్డుకునేందుకు యువత ముందుకు వచ్చి, కార్పొరేట్‌శక్తుల దోపిడీని ఎదుర్కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.అశోక్ మాట్లాడారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జె.జయరాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత నాయకులు వై.కేశవరావు తదితరులు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ విప్లవ గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.హరికిషోర్, ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల హబ్‌గా ఎపి

- ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఆంధ్ర రాష్ట్రాన్ని మాదక ద్రవ్యాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చేశారని, డ్రగ్స్ రవాణా, వాడకంలో ఎపి నంబర్ 1 అనే ముద్ర వేశారని ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. రాష్ట్రంలో డ్రగ్స్ కల్చర్ పై శనివారం ట్విట్టర్ వేదికగా ఆమె స్పందించారు. ఎపిని ఉడ్తా ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని, దేశంలో ఎక్కడ మాదక ద్రవ్యాలు దొరికినా దాని మూలాలు ఏపిలోనే ఉంటున్నాయని పేర్కొన్నారు. 25వేల కేజీల మాదక ద్రవ్యాలు బ్రెజిల్ నుంచి విశాఖ తీరం చేరితే .. తమ తప్పు లేదంటూ బిజెపి, వైసిపి, టిడిపి ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్రాల నిఘా వ్యవస్థల మద్దతు లేకుండా వేల కోట్ల డ్రగ్స్ తీరానికి ఎలా చేరతాయని ఆమె ప్రశ్నించారు. 'డ్రగ్స్ మాఫియాతో మీకు సంబంధం లేకుంటే ఇది సాధ్యమయ్యే పనేనా? మీ అండదండలతోనే కదా డ్రగ్స్ రవాణాలో ఏపి సేఫ్ హెవెన్‌గా మారింది. తెర వెనుక ఎంతటి వాళ్లున్నా నిజాలు నిగ్గు తేల్చాలని సిబిఐని కోరుతున్నా. ఆసియాలోనే అతిపెద్ద డ్రగ్ డీల్‌గా పరిగణించే ఈ మాఫియా వెనుక ఎవరున్నారో తేల్చేందుకు పారదర్శక విచారణ కోసం సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాం' అని ఆమె పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమణ

- వైసిపి ఎమ్మెల్యే రాంబాబుపై కేసు

ప్రజాశక్తి - మార్కాపురం (ప్రకాశం జిల్లా)



ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైసిపి అభ్యర్థి అన్నా వెంకటరాంబాబుపై ఎన్నికల అధికారులు కేసు నమోదు చేశారు. ఆయనతో పాటు ముస్లిం మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, 20వ వార్డు కౌన్సిలర్ షేక్ సలీంపైనా కేసు నమోదైంది. ఈ నెల 18న మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలో షాదీఖానా స్లాబ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అప్పటికే ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు టిడిపి నేతలు ఫిర్యాదు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా విచారణ చేపట్టారు. వాస్తవమని తేలడంతో మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్ ఫిర్యాదు మేరకు మార్కాపురం పోలీసులు ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

ఎలుగుబంటి దాడిలో ఇద్దరు మృతి

- మహిళకు తీవ్ర గాయాలు
- న్యాయం చేయాలని మృతదేహాలతో ఆందోళన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు, పలాస (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లాలో ఎలుగు బంటి బీభత్సం సృష్టించింది. జీడి తోటలో పని చేస్తున్న ముగ్గురిపై దాడి చేసింది. ఈ దాడిలో ఇద్దరు మృతి చెందగా, ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఉద్దానం ప్రాంతంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వజ్రపుకొత్తూరు మండలం అనకాపల్లి గ్రామానికి చెందిన చీడిపల్లి లోకనాథం (47), సావిత్రి దంపతులు తమ జీడి తోటలో పని చేస్తున్నారు. ఇంతలో ఎలుగుబంటి ఒక్కసారిగా వచ్చి లోకనాథంపై దాడి చేసి చంపేసింది. భర్తను కాపాడే సమయంలో సావిత్రిపైనా దాడి చేసి గాయపరిచింది. వెంటనే ఆమె బంధువులైన కూర్మారావుకు ఫోన్‌లో సమాచారం అందజేసింది. కూర్మారావు గ్రామస్తులతో కలిసి ట్రాక్టర్‌పై అక్కడకు చేరుకున్నారు. ఎలుగు బంటి ఒక్కసారిగా ట్రాక్టర్ ఎక్కి కూర్మారావుపై దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనను చూసి గ్రామస్తులందరూ భయంతో వణికిపోయారు. వెంటనే గాయపడిన సావిత్రిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలుగు బంటిని బంధించేందుకు చర్యలు ప్రారంభించారు. అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఉద్దాన ప్రాంతంలో ఎలుగు బంట్లు సంచరిస్తున్నాయని, వాటి దాడిలో ప్రజలు మృత్యువాత పడుతున్నారని కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద మృతదేహాలతో గ్రామస్తులు ధర్నా చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని వారిని శాంతింపజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై ఫారెస్టు అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఇంజనీరింగ్ కళాశాల బస్సు

- ఇద్దరు కడప వాసులు మృతి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం : అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాల వద్ద శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఓ ఇంజనీరింగ్ కళాశాల బస్సు ఢీ కొనడంతో ఇద్దరు కడప వాసులు మరణించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. అనంతపురం పివికెకె ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు అనంతపురం వైపు వస్తోంది. ఇదే సమయంలో కడప జిల్లా పెద్దమడియం మండలం బలపన గూడూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఏసోబు (25), బండన్న (24) బేల్దారి పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై అనంతపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో రోటరీ పురం ఎస్ఆర్ఐటి కళాశాల వద్దకు రాగానే ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి బస్సు ఢీకొంది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఆర్థిక సాయం అందిస్తున్న నారా భువనేశ్వరి

తిరుపతిలో 'నిజం గెలవాలి' యాత్ర

ప్రజాశక్తి - వాకాడు (తిరుపతి జిల్లా)

నిజం గెలవాలి యాత్రలో భాగంగా నారా భువనేశ్వరి శనివారం తిరుపతి జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గూడూరు నియోజకవర్గం వాకాడు మండలంలోని తిరుమూరు గ్రామానికి చెందిన పిడుగు వెంకటస్వామి గుండెపోటుతో మృతి చెందారు. దీంతో, ఆయన కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పిస్తూ ఆర్థిక సాయం అందజేశారు. తొలుత వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా నిజం వైపు నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పసల పెంచలయ్య, గూడూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పాసిం సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి రూ.1500 కోట్ల నిధులు

- నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

తాగునీటి సరఫరాకు సంబంధించి రాష్ట్రంలో ఎటువంటి నిధుల కొరత లేదని, ఇప్పటికే రూ.1500 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను కేటాయించి, విడుదల చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మంచినీటి సరఫరా, ఉపాధి హామీ పనుల కల్పన అంశాలపై శనివారం విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. వేసవి దృష్ట్యా ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కలెక్టర్లను ఆదేశించారు. జూన్ నెలాఖరు వరకు వేసవి కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలుచేయాలని సూచించారు. 15 రోజులకొకసారి మండల, జిల్లా స్థాయిలో భూగర్భ జల మట్టాల స్థాయిని మానిటరింగ్ చేయాలని, బోరు బావుల పరిస్థితిని కూడా సమీక్షించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి, నీటి వృథాను అరికట్టాలని సూచించారు. కాలువల ద్వారా విడుదల చేసే నీరు శివారు ప్రాంతాలకు సక్రమంగా చేరేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పై సమీక్ష నిర్వహిస్తూ, కూలీలకు పెద్ద ఎత్తున పనులు కల్పించాలని, అన్ని జిల్లాల యంత్రాంగం వంద రోజుల పని కల్పన లక్ష్యాన్ని అధిగమించాలని సిఎస్ ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులను ఉదయం 5.30 నుంచి 10.30ల వరకు నిర్వహించేలా చూడాలన్నారు. తాగునీటిని సరఫరా చేయాలని, ఉపాధి పనుల విధులు నిర్వహించే అధికారులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని అన్నారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కె. కన్నబాబు, జలవనరుల శాఖ ఇఎన్‌సి నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా వేదికను గెలిపించండి

- ఆవాజ్ రాష్ట్ర కమిటీ పిలుపు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్రంలో బిజెపితో ప్రత్యక్షంగా, పరోక్షంగా అంటకాగే పార్టీలను ఓడించి, ఇండియా వేదికలోని లౌకిక పార్టీలను, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎ సుభాన్, ఎంఎ చిస్టి పిలుపునిచ్చారు. లౌకికవాద పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా బిజెపిని ఓడించాలని శనివారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వారు కోరారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని, బడ్జెట్ కేటాయింపుల్లోనూ మైనార్టీల పథకాలకు కోత వేశారని, వివిధ పథకాలను నిలిపివేశారని విమర్శించారు.

మత ప్రాతిపదికన పౌరసత్వం అంటూ ముస్లిముల ఉనికినే ప్రమాదంలోకి నెట్టే సిఎఎ, ఎన్ఆర్‌సి చట్టాలను బిజెపి తీసుకొచ్చిందని చెప్పారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలను అణచివేసేవిధంగా బిజెపి నిరంకుశ పాలన సాగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోని టిడిపి, వైసిపిలు.. బిజెపి ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక చట్టాలన్నింటినీ సమర్థించాయని, దేశంలో దళితులు, మైనార్టీలపై దాడులు జరిగితే ఖండించలేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావటంలో ఈ రెండు పార్టీలు విఫలం చెందాయన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకుని, ప్రజల హక్కులను సంరక్షించుకునేందుకు అటు దేశంలో బిజెపి కూటమిని, ఇటు రాష్ట్రంలో టిడిపి, వైసిపి, బిజెపి, జనసేన పార్టీలను ఓడించాలని, ఇండియా వేదికలోని పార్టీలను, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఎఐ టూల్స్‌తో సామ్‌సంగ్ ఉత్పత్తులు

న్యూఢిల్లీ: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా ఎఐ టూల్స్‌తో టివి, స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాలను ఆవిష్కరించింది. ముంబయిలోని జియో వాల్డ్ ప్లాజాలో వీటిని ఆ కంపెనీ సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ డిఎక్స్ డివిజన్ సిఇఒ జాంగ్ హీ హన్ విడుదల చేశారు. అదే విధంగా ల్యాప్‌టాప్ సీరిస్‌లో గెలాక్సీ బుక్ 4ను అందుబాటులోకి తెచ్చింది. ఇంటెల్ కోర్ 5 ప్రాసెసర్, 8జిబి ర్యామ్ వేరియంట్ ధర రూ.70,990గా కంపెనీ పేర్కొంది.

కారుణ్య నియామకాలెన్ని?

- వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో జరిగిన కారుణ్య నియామకాలపై ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది. . న్యాయస్థానంలో ఉన్న ఒక కేసు నేపథ్యంలో ఈ వివరాలు సమర్పించాలని ప్రభుత్వం అన్ని శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. 2019 నుంచి ఇప్పటివరకు చేసిన నియామకాల వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. రెండేళ్ల క్రితం తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన కొన్ని నియామకాలపై న్యాయ స్థానంలో కేసు నడుస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై న్యాయస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే అడ్వొకేట్ జనరల్ కార్యాలయం నియామకాల వివరాలు కోరింది. కారుణ్య నియామకాలకు సంబంధించి అమలులో ఉన్న ఉత్తర్వులు, ఇతర మార్గదర్శకాల మేరకు నియామకాల వివరాలు సమర్పించాలని అన్ని శాఖలకు, ప్రభుత్వరంగ సంస్థలకు, స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థలకు సాధారణ పరిపాలన శాఖ తాజాగా లేఖ రాసింది. దీనికోసం ప్రత్యేకంగా ఒక ప్రొఫార్మాను కూడా అన్ని శాఖలకు పంపించింది. సంస్థ పేరు, ఆ సంస్థలో కారుణ్య నియామకాల కోసం అమలు చేస్తున్న విధానాలు, 2019 మార్చి ఒకటి నుంచి 2024 మార్చి ఐదో తేదీ వరకు ఎంత మందికి నియామకాల ఉత్తర్వులు ఇచ్చారు, ఇంకా ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి అన్న వివరాలు సమర్పించాలని ఆ సర్క్యులర్‌లో సాధారణ పరిపాలన శాఖ ఆదేశించింది.

చేనేతను ఆదుకున్నది వైసిపి ప్రభుత్వమే : లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో : చేనేత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుని అభివృద్ధిలోకి తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన పద్మశాలి ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బాటలోనే జగన్ నడుచుకుంటూ చేనేత కుటుంబాలకు అండగా నిలిచారని అన్నారు. చేనేతల ప్రగతికి వైసిపి ప్రభుత్వం తీసుకున్న చర్యలను సంక్షేమ పథకాలు పొందిన ప్రతి చేనేత కార్మికుడు ప్రచారం చేయాలని కోరారు. వైఎస్సార్ నేతన్న నేస్తం, ఇతర సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.3,706 కోట్ల లబ్ధిని వైసిపి ప్రభుత్వం చేనేతలకు చేకూర్చిందని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి వైసిపి అభ్యర్థి లావణ్య, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బిసిసెల్ అధికార ప్రతినిధిగా నాగిడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వైసిపి బిసి సెల్ అధికార ప్రతినిధిగా నాగిడి సాంబ శివరావును నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ బిసిలకు పెద్దపీట వేశారని పేర్కొన్నారు.. తన నియామకానికి కృషిచేసిన మాజీ మంత్రులు మోపిదేవి వెంకటరమణారావు, జోగి రమేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నేపథ్యంలో జోగి రమేష్‌ను శనివారం ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు పి.నాగరాజు, సైకం సాయిబాబు, వి.మణికంఠ, ఎస్.చినబాబు, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూపాయి రికార్డు పతనం

- దేశ చరిత్రలోనే తొలిసారి
- మోడీ పాలనలో భారత కరెన్సీ విలవిల



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాకలో వరుస పతనం.. దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి తరలిపోతున్న ఎఫ్ఐఐలు రూపాయి విలువపై ఒత్తిడిని పెంచు తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

ముంబయి : అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి వెలవెల పోతోంది. దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రధాని మోడీ హయంలో రికార్డ్ పతనాన్ని చవి చూసింది. శుక్రవారం నాడు విదేశీ మారకం మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే ఒక్క పూటలోనే 48 పైసలు క్షీణించి మునుపెన్నడూ లేని విధంగా 83.61కు పడిపోయింది. వరుసగా ఎనిమిది రోజుల పాటు దిగజారిన రూపాయి మారకం విలువ గురువారం 6 పైసలు పుంజుకుంది. తదుపరి రోజే డాలర్ ముందు 48 పైసలు కోల్పోవడం గమనార్హం.

ఓ దశలో 52 పైసలు నష్టపోయి 83.65కు పడిపోయి.. ఆల్‌టైం ఇంట్రాడే కనిష్టాన్ని చవి చూసింది. గతేడాది డిసెంబర్ 13న డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 83.40 స్థాయికి పడిపోయి జీవిత కాల కనిష్టాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత మళ్లీ తాజాగా భారీ పతనాన్ని చవి చూసింది. అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ ఇలాగే పడిపోతే దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల పరిణామాలు ఉంటాయి. అప్పుల చెల్లింపు భారం కానుంది. దిగుమతి ఉత్పత్తులు మరింత ప్రియం అవుతాయి. దేశ వాణిజ్య లోటు పెరగనుంది. ద్రవ్యోల్బణం ఎగిసి పడే ప్రమాదం ఉంది. దీంతో ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను పెంచనుంది. రూపాయి పతనం స్థూలంగా భారత ఆర్థిక వ్యవస్థను బలహీనపర్చనుంది.


తులసిరెడ్డితో భేటీ అయిన వివేకా కుమార్తె, అల్లుడు

తులసిరెడ్డితో వివేకా కుమార్తె, అల్లుడు భేటీ

ప్రజాశక్తి - వేంపల్లె

పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డితో శనివారం మాజీ మంత్రి వైఎస్.వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్.సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. దాదాపు గంటసేపు రాజకీయ విషయాలు, వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన విషయాలను చర్చించినట్లు సమాచారం. వివేకానందరెడ్డి హత్య జరిగిన తీరుపై ఎన్నికల ప్రచార సమయంలో ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలనే దానిపై ప్రధానంగా చర్చించినట్లు తెలిసింది. పులివెందుల అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే విషయమై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. అనంతరం కాంగ్రెస్ నాయకులను సునీతకు తులసిరెడ్డి పరిచయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్‌రెడ్డి, రాజా, బాలం సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అందని 'చేయూత'

- అయోమయంలో లబ్ధిదారులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

చేయూత పథకంలో భాగంగా అందాల్సిన రూ.18,750 సుమారు 15 రోజులు దాటినా లబ్ధిదారులకు అందలేదు. దీంతో, వీరంతా డబ్బులు అందుతాయో? లేదో? అంటూ అయోమయానికి గురవుతున్నారు. 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసుగల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ మహిళలకు జీవనోపాధి కల్పించే లక్ష్యంతో 2020 ఆగస్టు 12న వైఎస్ఆర్ చేయూత పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు మూడు విడతలుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ గ్రామంలో ఈ నెల ఏడున వైఎస్ఆర్ చేయూత 4వ విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. సభా వేదిక నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి రాష్ట్ర వ్యాప్తంగా 26,98,931 మంది లబ్ధిదారులకు రూ.5,060.49 కోట్ల సాయాన్ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ, ఇప్పటి వరకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎక్కడా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు పడలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఇటీవల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో లబ్ధి దారులు ఆందోళనకు గురవుతున్నారు. చేయూత అందుతుందా? లేదా? అనే గందరగోళానికి గురవుతున్నారు.



డబ్బులు పడలేదు

చేయూత కోసం వేలిముద్ర వేసి 14 రోజులు కావస్తున్నా ఇంతవరకు ఖాతాలో డబ్బులు పడలేదు. ప్రతి రోజూ బ్యాంకుకు వెళ్లి అడిగాను. ఇదే సమాధానం రావడంతో చివరకు విసుగొచ్చి బ్యాంకుకు వెళ్లడం మానేశాను. బటన్ నొక్కాను డబ్బులు మీ ఖాతాలో పడ్డాయి వెళ్లి తీసుకోండి అని చెప్పారు తప్ప, ఇంతవరకు వేయలేదు.

-ఎన్.దుర్గా చంద్ర చూడామణి, వీరఘట్టం



వెంటనే జమచేయాలి

చేయూత డబ్బులు వస్తాయని 14 రోజులుగా ఎదురు చూస్తున్నాం. ఎన్నికలు వస్తున్నందున డబ్బులు మరి రావని కొందరు చెబుతున్నారు. చేయూతపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. రోజూ బ్యాంకుకు తిరుగుతున్నాను. డబ్బులను లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో వెంటనే జమచేయాలి.

-కోరాడ లక్ష్మి, పూసపాటిరేగ

అమెజాన్‌లో ఉత్పత్తులు ప్రియం



న్యూఢిల్లీ : ప్రముఖ ఇ-కామర్స్ వేదిక అమెజాన్‌లో పలు ఉత్పత్తులు ప్రియం కానున్నాయి. అమెజాన్‌లోని విక్రేతలపై రుసుంను పెంచడమే ఇందుకు కారణం. ఏప్రిల్ 7వ తేదీ నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయని అమెజాన్ పేర్కొంది. ఇంటి అలంకరణ ఉత్పత్తులపై 9 శాతం ఉన్న విక్రేతల ఫీజును 13.5 శాతానికి చేర్చింది. లగ్జరీ బ్యూటీ ఐటమ్స్‌పై 5 శాతంగా ఉన్న ఛార్జ్‌ను 10 శాతానికి పెంచింది. స్లీప్‌వేర్ కేటగిరీలోని ప్రొడక్ట్స్‌కు సంబంధించిన విక్రయ రుసుంను 11 శాతం నుంచి 19 శాతానికి చేర్చింది. నిర్వహణ వ్యయాలు, వడ్డీ రేట్‌లు, ద్రవ్యోల్బణం. తదితర వాటిని దృష్టిలో ఉంచుకుని ఫీజులు పెంచాల్సి వచ్చిందని ఆ సంస్థ పేర్కొంది.

సంపాదకీయం


వెడ్ ఇన్ ఇండియా

పెళ్లి అనే రెండక్షరాల పదం... ఇద్దరు వ్యక్తులను ఒక్కటిగా ముడివేసే బంధం. జీవితంలో ఓ మధుర ఘట్టం. ఆ మధుర క్షణాలను ఎప్పటికీ గుర్తుండిపోవాలని యువతీయువకులు కలలు కంటారు. 'మంచి వివాహం కంటే మనోహరమైన, స్నేహపూర్వకమైన సంబంధం మరొకటి లేదు' అంటారు మార్టిన్ లూథర్. కానీ, చాలా భారతీయ వివాహాలు ఇప్పుడు మునుపటిలా లేవు. దేశంలో విభిన్న సంస్కృతులున్నట్లే వివాహాలు కూడా ఆయా సంస్కృతులు, సాంప్రదాయాల కనుగుణంగా జరిగేవి. సోషల్ మీడియా అల్గారిథమ్‌లను మార్చగల శక్తి వున్న సెలబ్రిటీల వివాహాల క్లిప్పింగ్స్... ఇప్పుడు మధ్య తరగతిపై ప్రభావం చూపుతున్నాయి. సాధారణ కుటుంబాల్లో జరిగే వివాహాలు కూడా వేరే ప్రాంతాలలో, తాహత్తుకు మించిన ఖర్చుతో చేస్తున్నారు. సంగీత్‌ల కోసం కొరియోగ్రాఫర్‌లను, మెహందీ డిజైనర్లను నియమించడం మొదలుపెట్టారు. డెస్టినేషన్ వెడ్డింగ్ ట్యాగ్ వుండేలా ఇతర ప్రాంతాల్లో స్టేజీపై డాన్స్ చేయడానికి కూడా శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఇది ఇప్పుడో ట్రెండ్‌గా మారింది. 'వివాహం నెగ్గాలంటే భార్యాభర్తలకి నటనలో కొంత తర్ఫీదు అవసరం' అంటాడు బుచ్చిబాబు 'చివరకు మిగిలేది'లో. ఇప్పుడు జరుగుతున్న పెళ్లిళ్ల తంతులో జరిగే ఫొటో సెషన్లు, మెహందీలు, సంగీత్‌లు చూస్తే... ఇక్కడి నుంచే నటన మొదలవుతుందేమో అనిపిస్తుంది.

పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే దేశంలో అదొక వ్యాపారంలా సాగుతుంది. సెలబ్రిటీలు, బడాబాబులు అయితే ఏకంగా కోట్లు ఖర్చు చేసి విదేశాల్లోనో, దేశంలోని చారిత్రక ప్రాంతాల్లోనో పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. అదొక స్టేటస్ సింబల్‌గా మారింది. దీంతో వెడ్డింగ్ అనేది అతిపెద్ద వ్యాపార పరిశ్రమగా మారింది. మొన్నటికి మొన్న అనంత్ అంబానీ- రాధిక మర్చంట్‌ల ప్రీ వెడ్డింగ్ ఈవెంట్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంబానీ వివాహంలో ప్రదర్శన ఇవ్వడానికి బియాన్స్, రిహన్నా వంటి వారికి భారీ మొత్తంలో డబ్బు చెల్లించి దిగుమతి చేసుకొంటున్నారు. దావోస్ సమ్మిట్‌తో పోల్చదగిన అతిథుల జాబితాను ఈ వివాహాల్లో చూస్తాం. 2024 జనవరి 15నుంచి, జూలై 15 వరకు వున్న పెళ్లిళ్ల సీజన్‌లో దేశవ్యాప్తంగా 42లక్షల వివాహాలు జరుగుతాయి. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.5.5లక్షల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. 'పెళ్లిళ్ల పేరుతో ఖర్చయ్యే డబ్బంతా కలిపితే భారతదేశంలో బిచ్చగాళ్లందరినీ పోషించవచ్చు' అంటారో రచయిత. మన్ కి బాత్‌లో భారతీయులు దేశంలోనే వివాహాలు చేసుకోవాలంటూ 'వెడ్ ఇన్ ఇండియా' అంటూ నినాదమిచ్చారు ప్రధాని మోడీ. అందుకే దేశంలోని వివిధ ప్రాంతాల్లో సెలబ్రిటీల వివాహాలు భారీగా జరుగుతున్నాయని, ఆ డబ్బంతా దేశంలోనే వుండిపోతుందని ప్రచారం హోరెత్తిస్తున్నారు. వికసిత భారత్ పేరుతో పథకాలు, విజయాలతో పాటు సోషల్‌మీడియాలో, టెలివిజన్‌లో ప్రొజెక్ట్ చేయబడిన పెద్దపెద్ద వివాహాలను చూపించే భారీ బిల్‌బోర్డుల వెనుక... కనబడకుండా నెట్టివేయబడిన, ఎవరూ పట్టించుకోని పేదరికం, దారిద్ర్యం వుంది. నిరుద్యోగం, ఆకలి కేకల గురించి మోడీ ఏనాడూ పెదవి విప్పడు. 'దేశ జాతీయ ఆదాయంలో ఎక్కువ భాగం ఒక్క శాతం మంది చేతిలో వుండిపోయిందని' వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ ల్యాబ్ నివేదిక వెల్లడించింది.


సెలబ్రిటీలకైనా, సామాన్యుడికైనా పెళ్లి జీవితంలో ఒక మధుర ఘట్టమే. బడాబాబుల పెళ్లిళ్లను చూసి, లేని ఆడంబరాలకు పోకుండా వున్నంతలో ఆనందంగా చేసుకునే పెళ్లి వేడుక జీవితంలో నిజంగానే మధురంగా, జీవితాంతం నెమరువేసుకునే అద్భుతమైన జ్ఞాపకంగా వుంటుంది. 'వికసిత్ భారత్'లో పెళ్లిలో గుర్రం ఎక్కేందుకు ప్రయత్నించిన దళితుడిని కొట్టిన సంగతి ఎవరికీ తెలియకుండా దాచిపెడతారు. ఇవి ఏ టీవీలోను, బిల్‌బోర్డులలోనూ కనబడవు. మిగతా 99శాతం మంది ప్రజల గొంతును నొక్కడం ఎల్లకాలం సాధ్యం కాదు. జీవితంలో జరిగే ఏ వేడుకైనా ఒక మధుర ఘట్టంగా, ఓ జ్ఞాపకంగా మిగలాలి. అందుకు భారీగా ఖర్చు చేయనవసరంలేదు. తమ శక్తికొద్దీ వెచ్చించి, మనస్ఫూర్తిగా ప్రక్రియ సాగిస్తే చాలు.

మంచి మాట



తెలివైన వారెప్పుడూ కాలాన్ని క్షణం కూడా వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుంటారు.
- జాన్ రస్కిన్, ఆంగ్ల రచయిత, తత్వవేత్త.

నిరంకుశ సర్కార్ చెరలో దేశం



ప్రస్తుతం



తెలకపల్లి రవి

ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడంతో నరేంద్ర మోడీ ప్రభుత్వ నిరంకుశత్వం పరాకాష్టకు చేరింది. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడూ అయిన అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు కోసం కేంద్రం పొంచి కూర్చున్న సంగతి అందరూ అనుకుంటున్నదే. లిక్కర్ స్కాం అనే దర్యాప్తులో వరుసగా అనేకమందిని అరెస్టు చేయడం ఒక ఎత్తయితే ఎన్నికల ప్రకటన జరిగాక రాజ్యాంగ పదవిలో వున్న అది కూడా దేశ రాజధాని ప్రాంతాన్ని పాలిస్తున్న కీలక నేతను వెంటబడి నిర్బంధించడం మరో ఎత్తు. ఇది రాజ్యాంగ విలువలకే ప్రమాదం. ఇది కేవలం కేజ్రీవాల్‌కో లేక ఆప్‌కో సంబంధించిన అంశమనుకుంటే తప్పు చేసినట్టే. ఈ మధ్యనే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ కూడా ఇలాగే అరెస్టు చేశారు. ఇదే ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ శిసోడియా ఇప్పటికి ఏడాదిగా జైలులోనే వున్నారు. ఒకటికి రెండు సార్లు ఎన్నికైన ముఖ్యమంత్రులకు కూడా చట్టబద్దంగా పోరాడే అవకాశం ఇవ్వకుండా ఏవేవో ఆరోపణలతో సాంకేతిక సాకులతో ఖైదు చేయడం ఫెడరలిజం మీద దాడి తప్ప మరొకటి కాదు. సిబిఐ, ఇ.డి లను ఫెడరల్ ఏజన్సీలు (కేంద్ర సంస్థలు) అని సంబోధిస్తుంటారు. ఫెడరలిజంపై ఫెడరల్ సంస్థల దాడిలో తీవ్రమైన హెచ్చరిక దాగివుందని గమనించడం అవసరం. లిక్కర్ వ్యవహారంలో ఏం జరిగిందనేదానికీ కేజ్రీవాల్ అరెస్టుకూ ఏ సంబంధం లేదు. ఇది కేవలం రాజకీయ కక్ష సాధింపే. ఎందుకంటే ఆప్ అధినేతగా ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ దీనికి బాధ్యత వహించవలసి వుంటుందని మాత్రమే తాజాగా సుప్రీం కోర్టుల్లో ఇ.డి అధికారులు చేస్తున్న వాదన కూడా. ఇందుకోసం వారు ఆప్ పార్టీని ఒక కంపెనీగా అభివర్ణించారు. మనీ లాండరింగ్ యాక్ట్ సెక్షన్ 4లో కంపెనీది బాధ్యత అన్నారు గనక ఆప్ నాయకుడుగా కేజ్రీవాల్ శిక్షార్హుడనేది వారి ఏకైక వాదన. దీనికి తోడు అప్రూవర్లుగా మార్చుకున్న వారు ఇచ్చిన సాక్ష్యాలంటూ కొన్ని చూపిస్తున్నారు. వాటి లోతుపాతులు అటుంచి అరెస్టు చేయకుండా విచారించే అవకాశం లేదా అనే ప్రశ్న తప్పక వస్తుంది. తొమ్మిదిసార్లు సమన్లు ఇచ్చినా రాలేదనే ఫిర్యాదు దీనికి జత చేస్తున్నారు. అదే నిజమైతే రాకపోవడంపైనే ఫిర్యాదు చేసి వుండాలికదా. ఒకసారి వెళితే అరెస్టు అనివార్యమనే అంచనాతోనే ఆయన వెళ్లలేదనేది నిపుణుల అభిప్రాయం. చివరకు వచ్చేసరికి ఏకంగా అరెస్టు వారంటుతోనే ఇంటికి రావడం ఆయన సందేహాన్ని ధృవపరిచేదిగా వుంది.

చెప్పిందేంటి? చేసిందేంటి?

ఇక్కడ ఇంకో పెద్ద ట్విస్టు. తనకు వరుసగా సమన్లపై సుప్రీం కోర్టులో విచారణ జరిగినప్పుడు అనవసరంగా వెంటాడుతున్నారని కేజ్రీ తరపు లాయర్లు వాదించారు. అరెస్టు చేసేందుకే ఇలా చేస్తున్నారని ఆరోపించారు కూడా. అయితే అక్కడ ఇ.డి తరపున వాదించిన అదనపు సొలిసిటర్ జనరల్ విఎస్ రాజు ఆ ఆరోపణను ఖండించారు. తాము కేవలం విచారించి తెలుసుకోవడానికి పిలుస్తున్నాము తప్ప అరెస్టు చేసే ఉద్దేశం లేదన్నారు. కానీ అదే రోజు సాయంత్రం సమన్లతో పాటు అరెస్టు వారంటు కూడా తీసుకుని ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లారు. ఇది ఒక విధంగా కోర్టు ధిక్కారమే. కేంద్ర సంస్థల కపట వర్తనకు ఇదో నిదర్శనం కూడా. అక్కడకు వెళ్లినప్పుడు వారి వ్యవహార సరళి, అంతులేని భద్రతా ఏర్పాట్లు, బిజెపి నేతల మూకుమ్మడి దాడి చూసిన తర్వాత అన్నీ అరెస్టు కోసమేనని దేశమంతటికీ తెలిసిపోయింది. అదే జరిగింది. దానిపై ముఖ్యమంత్రి వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారించింది గాని ఉపశమనం ఇవ్వలేదు. తర్వాత హైకోర్టు ఆయనను వారం రోజులు ఇ.డి రిమాండ్‌కు అనుమతినిచ్చింది. బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కవిత విషయంలోనూ పది రోజుల వరకూ అరెస్టు చేసే ఉద్దేశం లేదని హామీ ఇచ్చిన ఇ.డి నిజంగానే ఆరు మాసాల పాటు ఆమెకు వ్యవధి ఇచ్చింది. ఇక్కడ అది కూడా లేకుండా ఎకాఎకిని నిర్బంధంలోకి తీసుకున్నారంటే ముందే జరిగిన నిర్ణయమనేది స్పష్టం.

మామూలుగా ఒక ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలంటే గవర్నర్ అనుమతి తప్పనిసరి. ఢిల్లీకి లెఫ్టినెంట్ గవర్నర్ వుంటారు. నిజానికి గత ఎల్‌జిగా పని చేసిన తనే స్వయంగా కేజ్రీవాల్ ప్రభుత్వంపై కేసు పెట్టాలని ఆదేశించడం ఒక విపరీతం. కనుక అనుమతి ప్రశ్న లేకుండా పోయింది. ఆ తర్వాత కాలంలో చాలా ఉత్తర ప్రత్యుత్తరాలు, విచారణలు జరిగినా నిర్దిష్టంగా నిరూపితమైంది లేదు. అందులోనూ కేజ్రీవాల్ వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆధారాలేమీ లేవు. అసలు ఈ స్కామ్ అనబడేదాని ద్వారా వచ్చిందని చెబుతున్న మొత్తం వంద కోట్లు, ఇతరత్రా కలిపి ఇది రెండు వందల కోట్లు చూపిస్తున్నారు. వందలో నలభై కోట్లు గోవాలో ఎన్నికల కోసం పంపించారని ఆరోపణ. తన కంచుకోట వంటి ఢిల్లీలో చోటు లేకుండా చేయడమే గాక నెమ్మదిగా గుజరాత్‌లోనూ గోవాలోనూ కూడా సవాలు చేశారనేది ఆప్ పై బిజెపి ప్రత్యేక కక్ష. దేశమంతా తాము పాలిస్తుంటే ఆ పాలన జరిగే చోటును మరెవరో పాలించడం మోడీ బృందం ఎన్నడూ భరించలేకపోయింది. మధ్యతరగతి మద్దతుతో పట్టణ ప్రధానమైన సంస్కరణలతో కొంత సమాంతర పాలన అందించిన ఆప్ దేశ రాజకీయ పటంలో ఒక స్థానం సంపాదించుకుంది. నిజానికి ప్రాంతీయ పార్టీగా మొదలై జాతీయ పార్టీగా ఎదిగిన ప్రత్యేకత దానిదే. చాలా ప్రాంతీయ పార్టీలలో వలె ఒక నాయకుడి కుటుంబమే చక్రం తిప్పే సంస్కృతి ఆప్‌లో లేకపోవడం ఒక విశేషం. కేజ్రీవాల్ పాత్రనే ప్రధానంగా వున్నా పంజాబ్‌లో గెలిచిన తర్వాత అదీ కొంత మారింది. ఢిల్లీ ఓటర్లు కూడా శాసనసభకు ఆప్‌నూ లోక్‌సభకు బిజెపిని గెలిపిస్తూ మిశ్రమ చిత్రం సృష్టించారు. ఈ ద్వంద్వత్వం చాలా కాలం ఆప్‌పైనా ప్రభావం చూపింది.

> తన కంచుకోట వంటి ఢిల్లీలో చోటు లేకుండా చేయడమే గాక నెమ్మదిగా గుజరాత్‌లోనూ గోవాలోనూ కూడా సవాలు చేశారనేది ఆప్ పై బిజెపి ప్రత్యేక కక్ష. దేశమంతా తాము పాలిస్తుంటే ఆ పాలన జరిగే చోటును మరెవరో పాలించడం మోడీ బృందం ఎన్నడూ భరించలేకపోయింది.... బిజెపికి లోబడిపోతే భవిష్యత్తు వుండదనే వాస్తవం ఆయన గ్రహించగలిగారు. అందుకే తమపై దాడిని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు వివరించడానికి ఆయన దేశమంతా పర్యటించారు. 'ఇండియా'తో సహా పలు ప్రతిపక్ష సమావేశాలకు హాజరైనారు. కేంద్ర నిరంకుశత్వంపై పోరాటంలో పాలు పంచుకున్నారు. ఇవన్నీ సహజంగానే మోడీకి మింగుడు పడలేదు. పైగా కేజ్రీవాల్ రాజకీయాలకు తన భక్తిని జోడించి గుళ్లు కూడా తిరగడం మరింత ఆందోళన కలిగించి వుంటుంది. ఈ పూర్వరంగంలో లిక్కర్ ఆరోపణలు మోడీ సర్కారుకు చక్కగా అచ్చివచ్చాయి.

కేజ్రీవాల్ ఆంజనేయ దండకంతో సహా కొన్ని ప్రయోగాలు చేశారు. కానీ బిజెపికి లోబడిపోతే భవిష్యత్తు వుండదనే వాస్తవం ఆయన గ్రహించగలిగారు. అందుకే తమపై దాడిని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలకు వివరించడానికి ఆయన దేశమంతా పర్యటించారు. 'ఇండియా'తో సహా పలు ప్రతిపక్ష సమావేశాలకు హాజరైనారు. కేంద్ర నిరంకుశత్వంపై పోరాటంలో పాలు పంచుకున్నారు. ఇవన్నీ సహజంగానే మోడీకి మింగుడు పడలేదు. పైగా కేజ్రీవాల్ రాజకీయాలకు తన భక్తిని జోడించి గుళ్లు కూడా తిరగడం మరింత ఆందోళన కలిగించి వుంటుంది. ఈ పూర్వరంగంలో లిక్కర్ ఆరోపణలు మోడీ సర్కారుకు చక్కగా అచ్చివచ్చాయి.

తొలి నుంచీ కక్ష

వాస్తవానికి కేంద్రపాలిత ప్రాంతంగా వుండి పరిమితమైన అధికారాలు గల రాష్ట్రంగా మార్చబడిన ఢిల్లీలో దీర్ఘకాలం బిజెపి హవా వుండేది. దేశంలో కాంగ్రెస్ దెబ్బ తినిపోయినా అక్కడ మాత్రం షీలాదీక్షిత్ మూడు సార్లు ఎన్నికై సంచలనం సృష్టించారు. బిజెపిని దూరంగా వుంచారు. అన్నా హజారే అవినీతి వ్యతిరేక ఉద్యమ బృంద సభ్యుడుగా వుండి మార్పు కోసం ఆప్ స్థాపించిన కేజ్రీ ఈ నేపథ్యంలోనే రంగంలోకి వచ్చారు. తొలి ప్రయత్నంలోనే విభిన్న ప్రచారంతో ఎన్నికల్లో నెగ్గారు. అన్నాకు ఆయన రాజకీయాల్లోకి రావడం ఇష్టం లేదు. తన సూచనలను తోసిపుచ్చి ఆప్ ఏర్పడింది. తమాషా ఏమంటే కేంద్రంలో మోడీ, ఢిల్లీలో కేజ్రీ ఒకేసారి దేశం దృష్టికి వచ్చారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో బిజెపిని, కాంగ్రెస్‌ను ఓడిస్తూనే ఆప్ నిలదొక్కుకుంది. మొహల్లా క్లినిక్‌లు, పాఠశాలల విషయంలోనూ, మహిళల ఉచిత ప్రయాణం వంటి వాటిలోనూ కొత్త వరవడి పెట్టింది. సమస్యలు లేవని కాదు గాని సమాంతర లక్షణాలు కనబరిచింది. ఈ కాలమంతటా అక్కడే వున్న కేంద్ర పెద్దలు సహకరించకపోగా అడుగడుగునా గండాలు సృష్టించారు. పోలీసు అధికారాలతో సహా కేంద్రం గుప్పిట్లో వున్నందున ప్రతిదానికి పేచీలు పెట్టారు. బిల్లులపై సంతకాలు చేయకుండా ఎల్‌జి జంగ్ వేధించారు. చివరకు ఈ విషయంలో తమ రాజ్యాంగ హక్కుల కోసం సుప్రీం కోర్టులోనూ పోరాడిన కేజ్రీ ప్రభుత్వం విజయం సాధించింది. అంతకు ముందు కాలంలో ఢిల్లీ సర్కారు అంటే నామమాత్రపు అధికారాలనే భావన వుండేది. కేజ్రీవాల్ అలాగాక మిగిలిన రాష్ట్రాలతో పాటు ప్రాధాన్యత సాధించారు. గుజరాత్‌లో మంచి ఓటింగ్, పంజాబ్‌లో ప్రభుత్వ ఏర్పాటు తర్వాత జాతీయ పార్టీగా మారడం బిజెపి భరించలేని పరిస్థితిని సృష్టించింది. ప్రతి కాగితాన్నీ తప్పు పడుతూ ప్రతి చర్యనూ అడ్డుకుంటూ ముఖ్యమంత్రి పిఎ పైన, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపైన కూడా దాడులు చేశారు. అసలు అధికార యంత్రాంగం మొత్తం ఎల్‌జి అదుపులోనే వుండాలని సుప్రీం కోర్టులో కేంద్రం వాదిస్తే న్యాయస్థానం తిరస్కరించింది. చివరకు ఈ లిక్కర్ స్కాం అనేదాన్ని పట్టుకున్నారు. చివరకు కేజ్రీ అరెస్టు వరకూ తీసుకెళ్లారు.

ఇకనైనా ఎదిరిస్తారా?

గతంలో జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్, శిబు సొరేన్, మధు కోడా తదితరులు రకరకాల సందర్భాల్లో వివిధ కేసులలో జైలుకు వెళ్లిన మాట నిజమే గానీ వారు పదవులకు రాజీనామా చేసి లేదా కోల్పోయి వెళ్లారు. ఇక్కడ అధికార హోదాలోనే వెళ్లడం ఇదే తొలిసారి. ఒక విధంగా ఇది దేశంలో ప్రస్తుత పరిస్థితికి ప్రతిబింబమే. ప్రతిపక్ష నాయకులను, ప్రభుత్వాలను వెంటాడి వేటాడుతున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగానే ఆయనను అరెస్టు చేసింది. ఇందుకు ముందు రోజే న్యూస్ 18 సమిట్‌లో మాట్లాడుతూ మోడీ కేంద్ర సంస్థలు చర్యలు తీసుకోలేదని అంతకు ముందు అనేవారనీ, తన హయాంలో చర్య తీసుకుంటే గోల చేస్తున్నారని అపహాస్యం చేశారు. నిజానికి ఆయన హయాంలో అవినీతి పేరిట అరెస్టు చేసిన వారిలో 95 శాతం ప్రతిపక్షానికి చెందినవారే. ఇదంతా వ్యూహాత్మకంగా చేస్తున్న దాడి అని వేరే చెప్పనవసరం లేదు. నిజానికి ఈ సమయంలోనే ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి పది వేల కోట్లకు పైన వచ్చినట్టు అధికారికంగా వెల్లడైంది. అయినా తమ ఎంపీల సంఖ్యతో పోలిస్తే తక్కువే వచ్చిందని హోంమంత్రి అమిత్ షా బాహాటంగా వ్యాఖ్యానించారు. సరిగ్గా ఏ సంస్థలపైన ఇడి, సిబిఐ, ఐటి దాడులు జరిగాయో వాటి నుంచే వందల వేల కోట్లు బిజెపి కి ముట్టాయని ఇప్పుడు లెక్కలతో సహా తేలింది. ప్రధానికి సన్నిహితుడైన గౌతం అదానీ నిర్వాకాలపై అంతర్జాతీయ నివేదిక వస్తే విచారణ చేయకుండా మరింత వెసులుబాటు కల్పించారు. అమిత్ షా తనయుడైన జైషా మీద ఆరోపణలు వస్తే ప్రచురించిన మీడియాపై చర్య తీసుకున్నారు. ఇలా ఎన్ని సంస్థల నోరు నొక్కారో లెక్కలేదు. ఎన్నికల సంఘం కూడా వారి కనుసన్నల్లో పని చేసే పద్ధతి తీసుకొచ్చారు. సుప్రీంకోర్టు మాజీలకు పదవులిచ్చి, మరి కొందరిని అదరగొట్టి న్యాయాన్ని తమకు అనుకూలంగా మల్చుకున్నారు.

రాజ్యాంగబద్దంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను బేఖాతరు చేస్తూ కేంద్రీకృత పాలనకు బాట వేసుకుంటున్నారు. తమవైన మతతత్వ హిందుత్వ రాజకీయాలకు తోడు ఈ అప్రజాస్వామిక, నిరంకుశ పోకడలు దేశానికి ముప్పుగా మారుతున్నాయి. బడా మీడియా వంత పాడుతున్నందున ఇందుకు సంబంధించిన వివరాలు ప్రజలకు అందడం లేదు. అయినా అధికారం కోసం అనేక ప్రాంతీయ పాలక పార్టీలు వంత పాడుతున్న తీరుకు ఎపి, తెలంగాణ రాజకీయాలే నిదర్శనం. టిడిపి, జనసేన పూర్తిగా లొంగిపోగా వైసిపి పరోక్షంగా వత్తాసునిస్తూనే వుంది. ఇదే కేసులో వైసిపి ఎంపీలకు సంబంధించినవారు, బిఆర్‌ఎస్ సన్నిహితులు అప్రూవర్లుగా లొంగిపోయి వారు చెప్పినట్టు వింటుంటే ఆ పార్టీలు మాత్రం వత్తాసునిస్తూనే వున్నాయి. 2024 ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత జరుగుతున్న ఇంత అఘాయిత్యాన్ని 'ఇండియా' వేదిక ప్రతినిధులు ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చారు కూడా. రాజకీయ సమాన అవకాశాలు లేకపోతే ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగే ప్రసక్తి వుండదు. వేల కోట్లు బాండ్ల సొమ్ము తీసుకున్న బిజెపి కేంద్రం కాంగ్రెస్ ఖాతాలు స్తంభించేయడం ఇలాంటి వైపరీత్యమే. కేజ్రీవాల్ అరెస్టు ఈ దిశలో మరో అప్రజాస్వామిక ఘట్టం. కేరళలోనూ ఇలాగే చేయబోయి భంగపడ్డారని గుర్తు పెట్టుకోవాలి. ఇప్పటికైనా అవకాశవాదం మాని ఈ నిరంకుశత్వాన్ని ప్రతిఘటించితేనే దేశానికి రక్ష. వచ్చే ఎన్నికల్లో బిజెపి కూటమికి దేశవ్యాపితంగా తిరుగులేని పాఠం చెబితేనే రక్షణ. ★

వెల్లడైన హిందూత్వ-కార్పొరేట్ బంధం

వ్యాఖ్య

ఇప్పటివరకు విడుదల చేసిన ఎన్నికల బాండ్ల వివరాలను చూసినట్లైతే మతం-కార్పొరేట్ బంధం...మరింత నిర్దిష్టంగా చెప్పాలంటే...దేశంలో హిందూత్వ-కార్పొరేట్ మధ్య నెలకొన్న సంబంధం స్పష్టంగా ధృవీకరించబడింది.

అందుబాటులో వున్న డేటా ప్రకారం, ఎన్నికల బాండ్ల పథకం ద్వారా ప్రధానంగా లబ్ధి పొందింది బిజెపి. 2018లో ఈ బాండ్లను ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటివరకు ఏకంగా రూ.8,252 కోట్లు పొందింది. అంటే బాండ్ల ద్వారా వచ్చిన మొత్తంలో 50 శాతం ఈ పార్టీకే వెళ్ళిందన్నమాట. పాలక పార్టీకి, కార్పొరేట్లకు మధ్య లోపాయికారిగా కుదుర్చుకున్న ఒప్పందమిది. దీన్ని మోడీ ప్రభుత్వం చట్టబద్ధం చేసేసింది. కాంట్రాక్టులపై ముడుపులు ఇవ్వడం, లాభాలపై కమిషన్లు అందుకోవడం కార్పొరేట్లకు, బూర్జువా ప్రభుత్వానికి మధ్య గల వ్యాపార లావాదేవీలుగా వున్నాయి. చాప కింద నీరులా సాగుతున్న ఇదంతా రాజకీయ అవినీతికి మూలాధారమైంది. ఇటువంటి అవినీతిని చట్టబద్ధం చేయడానికి మోడీ ప్రభుత్వ అపరిమితమైన తెలివితేటలు ఉపయోగపడ్డాయి.

ఇలా బలవంతపు వసూళ్ళ ప్రహసనంలో కార్పొరేట్లు అమాయకులైన బాధితులని అనుకోవడం, అలా చూపించడం పొరపాటే కాగలదు. ముడుపులు, కమిషన్ల రూపంలో బిజెపికి ఎన్నికల బాండ్ల ద్వారా పెద్దమొత్తంలో నిధులు అందాయి. భవిష్యత్తులో కావాల్సిన పనులను చేసిపెట్టడానికి అవసరమైన గుడ్‌విల్ కూడా ఈ బాండ్ల ద్వారానే వారు సంపాదించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎం.ఇ.ఐ.ఎల్) అందచేసిన బాండ్లలో చాలా వరకు ఈ కేటగిరీలోకే వస్తాయి. ఉదాహరణకు, రూ.14,400 కోట్ల బిడ్ మొత్తంతో థానే-బోరివలి సొరంగం ప్రాజెక్టు కోసం వేర్వేరుగా రెండు ప్యాకేజీలను ఎం.ఇ.ఐ.ఎల్ పొందింది. ఇందులో పెద్ద మొత్తాన్ని ఎన్నికల బాండ్ల ద్వారా కాంట్రాక్టుకు చాలా నెలలు ముందుగానే సంస్థ అందచేసింది. జోజిలా రోడ్ సొరంగం ప్రాజెక్టుకు కూడా ఇదే ధోరణి వర్తించింది. అటవీ ప్రాంతాల్లో ప్రాజెక్టులకు అనుమతులు పొందడం కోసం కొన్ని మైనింగ్ కంపెనీలు కూడా పాలక పార్టీకి ఎన్నికల బాండ్ల ద్వారా మొత్తాలు చెల్లించాయి.

ఇక, ఫార్మస్యూటికల్ రంగానికి చెందిన పలు కంపెనీలు కూడా ఎన్నికల బాండ్ల ద్వారా పెద్ద మొత్తాలనే అందచేశాయి.

> ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించినంతవరకు, అఖిల భారతీయ ప్రతినిధి సభ మూడు రోజుల సమావేశాలు ముగిసిన తర్వాత... ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె మాట్లాడుతూ... ఎన్నికల బాండ్లను సమర్థించారు. "ఎన్నికల బాండ్ల పథకమనేది ఒక ప్రయోగం, అనేక స్థాయిల్లో అనేక అంశాలను పరిశీలించిన మీదట తీసుకువచ్చిన ఈ పథకాన్ని ఏదో అకస్మాత్తుగా ప్రవేశపెట్టలేదు." అని చెప్పుకొచ్చారు. "ఏదైనా ఒక మార్పును తీసుకువచ్చినపుడు, అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఇవిఎంలను ప్రవేశ పెట్టినపుడు కూడా ఇలాగే అనేక ప్రశ్నలు తలెత్తాయి." అని ఆయన పేర్కొన్నారు. ఆ రకంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించినంత వరకు, ఎన్నికల బాండ్ల పథకమనేది ఒక విలువైన ప్రయోగం. అనవసరంగా దీన్ని ఆపరాదు. అని చెప్పడం ద్వారా హిందూత్వ ప్రాజెక్టుతో కార్పొరేట్లు అనుసంధానమయ్యారని ఆర్‌ఎస్‌ఎస్ పరోక్షంగా అంగీకరించినట్లే అయ్యింది.

ఇక్కడ, మొత్తంగా 35 ఫార్మా కంపెనీలు బాండ్ల ద్వారా ఏకంగా దాదాపు రూ.1000 కోట్లు ఇచ్చాయి. వీటిలో, ఇప్పటివరకు ఏడు కంపెనీలను గుర్తించారు. వాటిపై జరిపిన దర్యాప్తు ప్రకారం నాణ్యత లేని ఔషధాలు తయారు చేసినందుకు ఆ కంపెనీలు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశాయి. దీనివల్ల నాసిరకం మందులు ఉత్పత్తి చేస్తున్నందుకు ఎదురయ్యే చర్యలను తప్పించుకోవడానికి ఈ కంపెనీలకు ఇవి ఎంతగానో సహాయపడ్డాయి.

అజ్ఞాత బాండ్ల పథకం ద్వారా క్విడ్ ప్రో కో (నీకు ఇంత, నాకు అంత) జరిగిందనడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ రకంగా పార్టీకి నిధులను సేకరించే పద్ధతికి మోడీ ప్రభుత్వం మరో అరిష్టదాయకమైన కొత్త కోణాన్ని చేర్చింది. రాజకీయ ప్రత్యర్థులను, స్వతంత్ర వార్తా సంస్థలను, సివిల్ సొసైటీ సంస్థలను లక్ష్యంగా చేసుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐ, ఆదాయ పన్ను విభాగాలు వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎలా ఉపయోగిస్తున్నారో మనం ఇప్పటికే చూస్తున్నాం. ఈ రకంగా ఈ సంస్థలను చట్ట విరుద్ధంగా ఉపయోగిస్తూ కార్పొరేట్ల నుండి నిధులను బలవంతంగా వసూలు చేయడానికి సృజనాత్మకంగా వర్తింపచేశారు. కార్పొరేట్ల దుర్వినియోగాలు అవి వాస్తవమైనవి లేదా ఊహించినవి ఏవైనా సరే దాడులు చేయడానికి, దర్యాప్తు చేపట్టడానికి, నిధులు, ఆస్తులను జప్తు చేయడానికి ఉపయోగపడ్డాయి. ఇటువంటి కంపెనీల యజమానులే ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి, కేంద్రంలోని పాలక పార్టీకి ఉదారంగా విరాళాలు అందచేశారని వెల్లడైంది. ఇటువంటి బలవంతపు నిధుల వసూళ్ళలో రెండు కోణాలు వున్నాయి-ఒకటి, చట్టవిరుద్ధమైన బెదిరింపులు, బ్లాక్‌మెయిళ్ల ద్వారా బలవంతపు వసూళ్ళ నేరానికి పాల్పడ్డం. ఇందుకు ప్రభుత్వ సంస్థలు సహకరిస్తాయి. రెండోది, వాస్తవంగానే చట్టాన్ని ఉల్లంఘించి, తీవ్రమైన అవకతవకలకు, దుర్వినియోగాలకు పాల్పడిన వారు ముడుపులు చెల్లించడానికి అనుమతించడం.



పారదర్శకత గురించి గొప్పగా చెబుతూ, పరిశుద్ధమైన నిధులే రాజకీయ వ్యవస్థలోకి వస్తున్నాయని చెప్పుకోవడాన్ని అవహేళన చేసేలా పెద్ద మొత్తంలో నల్ల ధనాన్ని వెలికి తీయడానికి, మనీ లాండరింగ్‌కు వెసులుబాటు కల్పించేలా బూటకపు కంపెనీలు అనేకం పుట్టుకొచ్చాయనడానికి తగినన్ని సాక్ష్యాధారాలు కూడా బయటపడ్డాయి. ఉదాహరణకు, అస్సలు లాభాలు కూడా ఆర్జించని కంపెనీలు కూడా కొన్ని బాండ్ల ద్వారా పెద్ద మొత్తంలో నిధులు అందచేశాయని వెల్లడైంది. గత నాలుగేళ్ల కాలంలో అటువంటి కంపెనీలు సంపాదించిన లాభాల కంటే చాలా పెద్ద మొత్తంలో నిధులను బాండ్ల ద్వారా అందచేశాయి.

ఈ రకంగా ఎన్నికల బాండ్ల పథకమనేది హిందూత్వ-కార్పొరేట్ సంబంధాల నుండి పుట్టుకొచ్చినదేనన్న విషయం స్పష్టమైంది. ఒకవైపు వ్యాపార సంస్థలు, సంఘాల నుండి వచ్చిన ప్రతిస్పందనలు మరోవైపు ఆర్‌ఎస్‌ఎస్ స్పందించిన తీరు చూస్తుంటే ఇది తేటతెల్లమవుతోంది.

ఎన్నికల బాండ్లకు సంబంధించిన విశిష్ట గుర్తింపు సంఖ్యలను వెల్లడించకుండా నిలుపు చేయాలని కోరుతూ పారిశ్రామిక రంగంలోని మూడు ప్రధాన సంస్థలైన-ఫిక్కి (భారత వాణిజ్య పారిశ్రామిక మండళ్ల సమాఖ్య), భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్)లు సంయుక్తంగా సుప్రీం కోర్టులో మధ్యవర్తిత్వ దరఖాస్తును దాఖలు చేశాయి. "చట్టబద్ధ పాలనను దెబ్బ తీసేలా, పారిశ్రామిక ప్రయోజనాలకు తీవ్రమైన పర్యవసానాలు కలిగించేలా విశ్వసనీయమైన ఒప్పందాల ఉల్లంఘన" గురించి ఈ పారిశ్రామిక సంస్థలు మాట్లాడుతున్నాయి. వివిధ క్విడ్ ప్రో కో ఒప్పందాలతో సంబంధం వున్న నేపథ్యంలో తమ రహస్య ఒప్పందాల గురించి బయటకు వెల్లడవ్వాలని కార్పొరేట్లు కోరుకోవడం లేదు. అయితే, సుప్రీం కోర్టు వారి దరఖాస్తును విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది.

ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించినంత వరకు, అఖిల భారతీయ ప్రతినిధి సభ మూడు రోజుల సమావేశాలు ముగిసిన తర్వాత, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలె మాట్లాడుతూ, ఎన్నికల బాండ్లను సమర్ధించారు. "ఎన్నికల బాండ్ల పథకమనేది ఒక ప్రయోగం, అనేక స్థాయిల్లో అనేక అంశాలను పరిశీలించిన మీదట తీసుకువచ్చిన ఈ పథకాన్ని ఏదో అకస్మాత్తుగా ప్రవేశపెట్టలేదు." అని చెప్పుకొచ్చారు. "ఏదైనా ఒక మార్పును తీసుకువచ్చినపుడు, అనేక ప్రశ్నలు తలెత్తుతాయి. ఇవిఎంలను ప్రవేశ పెట్టినపుడు కూడా ఇలాగే అనేక ప్రశ్నలు తలెత్తాయి." అని ఆయన పేర్కొన్నారు. ఆ రకంగా ఆర్‌ఎస్‌ఎస్‌కు సంబంధించినంత వరకు, ఎన్నికల బాండ్ల పథకమనేది ఒక విలువైన ప్రయోగం. అనవసరంగా దీన్ని ఆపరాదు. అని చెప్పడం ద్వారా హిందూత్వ ప్రాజెక్టుతో కార్పొరేట్లు అనుసంధానమయ్యారని ఆర్‌ఎస్‌ఎస్ పరోక్షంగా అంగీకరించినట్లే అయ్యింది.

ఇప్పుడు, ఎన్నికల బాండ్లకు సంబంధించిన డేటా మొత్తాన్ని- వాటి విశిష్ట సంఖ్యలతో సహా మార్చి 21కల్లా ఎన్నికల కమిషన్‌కు వెల్లడించాలని ఎస్‌బిఐని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీనితో జారీ చేసిన బాండ్ల విశిష్ట గుర్తింపు సంఖ్యతో దాన్ని రెడీమ్ చేసుకున్న వివరాలు సరిపోలితే ఎవరు, ఎంత మొత్తాలను ఏ పార్టీకి, ఏ సమయంలో ఇచ్చారో తెలిసిపోతుంది. దీనివల్ల హిందూత్వ పార్టీకి, కార్పొరేట్లకు మధ్యగల లోతైన సంబంధాలు మరింతగా ధృవీకరించబడతాయి.

అవకతవకలు, అవినీతి ముడుపులు, మనీ లాండరింగ్, బ్లాక్‌మెయిల్, బెదిరింపుల ద్వారా బలవంతపు వసూళ్ళు వంటి వాటికి సంబంధించి ఇబ్బడి ముబ్బడిగా అందిన ఈ సమాచారంతో ఎలా వ్యవహరిస్తారన్నది ఇప్పుడు తలెత్తే ప్రధానమైన ప్రశ్నగా వుంది. కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టడమొక్కటే సాధ్యమైన కార్యాచరణగా వుండనుంది. ఆ దర్యాప్తులో వెల్లడైన సమాచారం ప్రాతిపదికన ఎక్కడ అవసరమైతే అక్కడ చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వుంటుంది.

(మార్చి 18 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

వ్యాపారాలు దెబ్బతినకుండా చర్యలుండాలి

- జిఎస్‌టి అధికారులు విచక్షణ పాటించాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి భుయాన్
- సున్నితంగా పన్ను వసూళ్లు చేయాలి
- టిఎస్ హైకోర్టు సిజె అలోక్ ఆరాధే



హైదరాబాద్ : వ్యాపారాలు దెబ్బతినకుండా జిఎస్‌టి అధికారులు తమ అధికారాలను ఉపయోగించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఎఫ్‌టిసిసిఐ కార్యాలయంలో జాతీయ పన్ను సదస్సును నిర్వహించారు. తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) మద్దతుతో 49 ఏళ్ల ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ (ఎఐఎఫ్‌టిపి) సౌత్ జోన్ దీన్ని నిర్వహించింది. దీనికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే పాల్గొని మాట్లాడారు. ఎనిమిది ఏళ్ల విరామం తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

న్యాయమూర్తి ఉజ్జల్ భుయాన్ ప్రారంభోపన్యాసం చేశారు. తన వ్యక్తిగత అనుభవాలను, సెక్షన్ 69 కింద జిఎస్‌టి అరెస్ట్ నిబంధనలు, జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 83 కింద ఆస్తుల అటాచ్‌మెంట్ నిబంధనలపై పలు మైలురాయి తీర్పులను ఆయన పంచుకున్నారు. దేశంలోని ఏ కోర్టు కూడా అరెస్టయిన వారికి బెయిల్ ఇవ్వనప్పటికీ, ఒక వ్యక్తిని అరెస్టు చేసే అధికారం ఉన్న అధికారులు ఆ వ్యక్తిని అరెస్టు చేయడానికి ముందు కారణాన్ని కూడా నమోదు చేయాలనే సూత్రం ఆధారంగా మేము బెయిల్ మంజూరు చేశామన్నారు. జిఎస్‌టి చట్టంలోని సెక్షన్ 69 మరియు 83తో పోల్చితే మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002 (పిఎమ్ఎల్ఎ) నిబంధనను ఆయన గుర్తు చేశారు. అధికారులకు ఇచ్చిన ఈ కఠినమైన చట్ట నిబంధనలు వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. వ్యాపారం కుంటుపడకుండా అధికారాన్ని విచక్షణతో వినియోగించుకోవాలని భుయాన్ పేర్కొన్నారు.

న్యాయమూర్తి అలోక్ ఆరాధే మాట్లాడుతూ.. "పన్ను అనేది పౌర సమాజానికి కీలకమైన స్తంభమని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని నడపడానికి ప్రభుత్వం పన్నులు విధిస్తుంది. ఇది సమాజం యొక్క సామాజిక, ఆర్థిక వృద్ధిని నెరవేరుస్తుంది. పన్ను అనేది విస్తారమైన అంశం. ఇది సంక్లిష్టమైనది. వేగంగా మారుతున్నది. చాణక్యుడు చెప్పిన విధంగా తేనెటీగలు పువ్వుల నుండి తేనెను సేకరిస్తున్నట్లుగా, సున్నితంగా, నొప్పిని కలిగించకుండా పౌరుల నుండి పన్నులు తప్పని సరిగా వసూలు చేయాలని అన్నారు. అధికారులు సామూహిక వివేకాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఎఫ్‌టిసిసిఐ ప్రెసిడెంట్ మీలా జయదేవ్ మాట్లాడుతూ.. మారుతున్న చట్టాల్లోని పరిణామాలతో పన్నుల గురించిన చట్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడమే ఈ సదస్సు అని అన్నారు. అనేక రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలో జిఎస్‌టి టర్నోవర్ పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెంచాలని ఎఫ్‌టిసిసిఐ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో కాన్ఫరెన్స్ కమిటీ చైర్మన్ నాగేష్ రంగి, ఎఐఎఫ్‌టిపి నేషనల్ ప్రెసిడెంట్ నారాయన్ పి జైన్, తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె నర్సింగరావు, ఎఐఎఫ్‌టిపి సౌత్ జోన్ చైర్మన్ రామరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహువా మొయిత్రా నివాసాల్లో సిబిఐ సోదాలు



కోల్‌కతా : తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన మాజీ ఎంపి మహువా మొయిత్రా నివాసాల్లో సిబిఐ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోని మహువా మొయిత్రా నివాసంలోనూ, ఇతర నగరాల్లో ఆమెకు చెందిన కార్యాలయాల్లోనూ, భవనాల్లోనూ సిబిఐ అధికారులు సోదాలు చేపట్టారు. పార్లమెంట్‌లో అదానీ గ్రూపుపై, ఆ గ్రూపునకు ప్రధాని మోడీకి ఉన్న సన్నిహిత సంబంధాలపై మొయిత్రా ప్రశ్నలు సంధించిన సంగతి తెలిసిందే. ఈ విధంగా పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు ప్రముఖ వ్యాపారవేత్త దర్శన్ హీరానందానీ నుంచి మహువా రూ.2 కోట్లతోపాటు ఖరీదైన బహుమతులు తీసుకున్నారంటూ ... బిజెపి ఎంపి నిషికాంత్ దుబే ఫిర్యాదు చేశారు. ఈ కేసు కారణంగా ఆమె లోక్‌సభ సభ్యత్వం రద్దయింది. నిషికాంత్ దుబే ఫిర్యాదు మేరకు... మహువాపై దర్యాప్తు చేపట్టాలని, ఆరు వారాల్లోగా నివేదిక సమర్పించాలని సిబిఐని యాంటీ కరప్షన్ లోక్‌పాల్ ఆదేశించింది. దీంతో గత గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సిబిఐ శనివారం తనిఖీలు నిర్వహించింది. బిజెపి ఎంపి ఆరోపణలను, తనపై స్పీకర్ వేసిన బహిష్కరణ వేటును మహువా తీవ్రంగా ఖండించారు. లోక్‌సభలో బహిష్కరణ వేటుపై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇదే వ్యవహారానికి సంబంధించిన విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనల ఉల్లంఘన కేసులో ఇడి మహువాకు సమన్లు జారీ చేసింది. ప్రతిపక్ష నాయకులపై వేధింపుల్లో భాగంగానే తనను వేధిస్తున్నారని ఆమె పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్న అధికారులు

సిఇవోకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ అభ్యర్థుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నారని టిడిపి విమర్శించింది. పోలీస్, ఇంటెలిజెన్స్ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి శనివారం లేఖ రాశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విజయవాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తమ పార్టీ విజయవాడ అభ్యర్థి కేశినేని చిన్ని ఫోన్లను ట్యాప్ చేశారని చెప్పారు. తమ పార్టీ వర్క్‌షాప్ వద్దకు ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ వచ్చారని తెలిపారు. టిడిపి, జనసేన అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఫోన్లతో పాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఫోన్ కూడా ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. పోలీస్ ఉన్నతాధికారి సీతారామాంజనేయులు ఆధ్వర్యంలో ఈ వ్యవహారం జరుగుతోందని పేర్కొన్నారు. గత తెలంగాణ ప్రభుత్వం పెగాసెస్ సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేసినప్పుడే సిఎం జగన్ అదే తరహా సాఫ్ట్‌వేర్ కొనుగోలు చేశారని ఆరోపించారు. తామిచ్చిన ఫిర్యాదుపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి మోడీ ఫోటో తొలగింపు

- రాష్ట్రాల్లో సీఎంల ఫోటోలు కూడా..

న్యూఢిల్లీ : లోక్‌సభ, ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు భారత ఎన్నికల సంగం (ఇసిఐ) నోటిఫికేషన్‌ను విడుదల చేయటంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ కోడ్ ప్రభావంతో అన్ని మేజర్ ప్రభుత్వ వెబ్‌సైట్ల నుంచి ప్రధాని మోడీ ఫోటో తొలగిపోయింది. ఎన్నికల కోడ్‌కు ముందు అన్ని ప్రభుత్వ వెబ్‌సైట్లలో మోడీ ఫోటో ఉండేది. అయితే, ప్రధాని వ్యక్తిగత సైట్, పీఎం కిసాన్, ఆర్టీ వంటి పోర్టల్స్‌లో సైతం ప్రధాని స్థాయిలో మోడీ ఫోటో కనిపించటం లేదు. అలాగే, పీఎం ఆన్ రేడియో, మైగవ్ వెబ్‌సైట్ల సహా అన్ని ప్రభుత్వ వెబ్‌సైట్‌ల నుంచి 'మన్ కీ బాత్' రేడియో షో అన్ని ఎపిసోడ్‌ల డిజిటల్ రికార్డింగ్‌లు తొలగించబడ్డాయి. అలాగే, ఆయా రాష్ట్రాల ప్రభుత్వ వెబ్‌సైట్లలోనూ ఇదే తీరు కనిపించింది. ఆయా రాష్ట్రాల సీఎంల ఫోటోలు వాటి నుంచి తొలగించబడ్డాయి.

బిజెపికి గుణపాఠం తప్పదు

- హెచ్ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ విభాగం అధ్యక్షులు అప్పారావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)


విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ చర్యలను ఆపకుంటే కేంద్రంలోని బిజెపికి రానున్న కాలంలో ప్రజలు తప్పక గుణపాఠం చెబుతారని హెచ్ఎంఎస్ స్టీల్‌ప్లాంట్ విభాగం అధ్యక్షులు డి.అప్పారావు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 1087వ రోజుకు చేరాయి. దీక్షనుద్దేశించి అప్పారావు మాట్లాడుతూ మూడేళ్లకుపైగా రాష్ట్ర వ్యాప్తంగా ఉక్కు పరిరక్షణ ఉద్యమం సాగుతున్నప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. మోడీకి మద్దతు ఇస్తున్న పార్టీలు కూడా పునరాలోచన చేయాలని హితవుపలికారు. దీక్షల్లో నాయకులు ఒనుము అప్పలరాజు, ద్వారపూడి ఈశ్వరరావు, డి.కనకరాజు, గొందేసి సత్యారావు, బత్తిన పెంటయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కడుబండికి చుక్కెదురు

- గ్రామ సందర్శనకు అనుమతి లేదని నిలుపుదల
- వెనుదిరిగిన నాయకులు

ప్రజాశక్తి-జామి

విజయనగరం జిల్లా శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు ఎన్నికల ప్రచారంలో చుక్కెదురైంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుండగా గ్రామ సందర్శన కార్యక్రమాన్ని అనుమతి లేకుండా నిర్వహించడం తగదంటూ అధికారులు ఆ సమావేశాన్ని నిలుపుదల చేశారు. మండలంలోని రామయ్యపాలెంలో శనివారం గ్రామ సందర్శన కార్యక్రమానికి అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. యథావిధిగా ఎమ్మెల్యే గ్రామానికి చేరుకుని, సమావేశానికి సిద్ధమవుతున్న తరుణంలో గ్రామ కార్యదర్శి నజ్మా... సమావేశానికి అనుమతులు తీసుకోలేదని, కాబట్టి సమావేశం నిర్వహించడం కుదరదని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే అక్కడ నుంచి వెనుదిరిగారు. అయితే అధికారులు ఎన్నికల నియమావళిని గుర్తు చేయడంతో పాటు సమావేశానికి అడ్డుపడడం అధికార పార్టీ నాయకులకు మింగుడు పడలేదు. ఈ విషయంపై ఎంపిడిఒను వివరణ కోరగా, అనుమతి లేని కారణంగా సమావేశం నిలుపుదల చేయడం వాస్తవమేనని తెలిపారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా సమావేశాలు, సభలకు అనుమతి తప్పనిసరి అని గుర్తు చేశారు.



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి- మెంటాడ (విజయనగరం)

విజయనగరం జిల్లా మెంటాడ మండలంలోని సరిహద్దు గిరిజన గ్రామం కొర్రవానివలసకు చెందిన సుమారు 25 కుటుంబాలు గత ఎనిమిది నెలలుగా తాగునీటికి అవస్థలు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు అన్నారు. గిరిజన మహిళలు సుదూర ప్రాంతాల ఊట బావుల వద్దకు వెళ్ళి కలుషిత నీటిని తెచ్చుకుని కాలం వెళ్లదీస్తున్నారన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో ఖాళీ నీళ్ల బిందెలతో గ్రామంలో నిరసన తెలిపారు. మండలానికి సంబంధించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారికి, స్థానిక జెడ్‌పిటిసి దీశరి గంగరాజు, గరుగుబిల్లి సర్పంచ్ బొంగు సింహాచలంకు ఫోన్‌లో ఫిర్యాదు చేసామని తెలిపారు. తక్షణమే సోలార్ పంపులైన్ మోటారు బాగుచేసి గిరిజనులకు తాగునీరు అందించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- కేజ్రీవాల్ అరెస్టుపై గెహ్లాట్

జైపూర్ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్నికల వేళ అరెస్టు చేయడమంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్ అన్నారు. 'ఎలాంటి రుజువు లేకుండానే కేజ్రీవాల్‌పై దర్యాప్తు సంస్థ చర్యలు తీసుకుంది. సిట్టింగ్ సిఎంని అరెస్టు చేసిన తీరు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ప్రజలు ఎన్నుకున్న నేత ఆయన. వారేమన్నా హత్య చేశారా? వారెక్కడికైనా పారిపోయారా?' అని గెహ్లాట్ ప్రశ్నించారు. ఆధారాల్లేకుండా..ఎవరో చేసిన ప్రకటనలే కొలమానంగా ఇడి అధికారులు తీసుకోవడం సరికాదన్నారు. అయితే కేజ్రీవాల్ అరెస్టుతో ఆ రాష్ట్రంలో ఇప్పుడు ఎన్నికలు జరుగుతాయా లేదా అని ప్రజలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారని గెహ్లాట్ అన్నారు.

73 మంది అభ్యర్థులపై అనర్హత వేటు

ఛత్తీస్‌గఢ్ : ఎన్నికల వేళ ... ఛత్తీస్‌గఢ్ రాజకీయాల్లో సంచలనం రేగింది. ఎన్నికల నిబంధనలను పట్టించుకోని 73 మంది అభ్యర్థులపై కేంద్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు వేసింది. ఛత్తీస్‌గఢ్‌లో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. వీటిని పరిశీలించాక సంబంధిత అధికారులు అనర్హుల జాబితాను విడుదల చేశారు. డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి యుఎస్ బాండే మాట్లాడుతూ ... రాయ్‌పూర్ జిల్లా నుండి గరిష్టంగా 17 మంది అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించారు. ఈ అనర్హుల జాబితాను భారత ఎన్నికల సంఘం వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసిందని చెప్పారు. ఖర్చు వివరాలు తెలియజేయని లేదా ఇతర నిబంధనలను పాటించని ఈ అభ్యర్థులు రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి అవకాశం లేదంటూ ... భారత ఎన్నికల సంఘం తన వెబ్ సైట్‌లో ఈ అభ్యర్థుల జాబితాను వెల్లడించింది. అనర్హతకు గురయిన ఈ 73 మందిలో 65 మంది అభ్యర్థులు 2024 వరకు, ఎనిమిదిమంది అభ్యర్థులు 2025 వరకు ఎన్నికల్లో పోటీ చేయలేరు. ఛత్తీస్‌గఢ్‌లోని 11 స్థానాలకు మూడు దశల్లో పోలింగ్‌ను నిర్వహించనున్నారు. ఏప్రిల్ 19న రాష్ట్రంలో తొలి దశ పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఏప్రిల్ 19న ఒక స్థానానికి, ఏప్రిల్ 26న మూడు స్థానాలకు, మే 7న ఏడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

35 మంది సముద్ర దొంగలను పట్టుకొచ్చిన ఐఎన్ఎస్

ముంబయి : సోమాలియా తీరంలో ఆటంకాలు సృష్టిస్తున్న 35 మంది సముద్ర దొంగలను భారత నావికా దళం పట్టుకొచ్చింది. వీరిని ఐఎన్ఎస్ కొల్‌కతా ద్వారా శనివారం ఉదయం ముంబయి తీరానికి తీసుకొచ్చింది. 35 మంది సముద్రపు దొంగలను ముంబయి పోలీసులకు అప్పగించింది. అరేబియన్ సముద్రం, గల్ఫ్ ఆఫ్ అడెన్‌లో వాణిజ్య నౌకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా సాగిపోయేందుకు ఇండియన్ నేవీ 'ఆపరేషన్ సంకల్ప్' చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 15న అరేబియా సముద్రంలో పైరేట్ల నౌక ఎక్స్-ఎంవీ రూయెన్‌ను అడ్డగించిన భారత నౌక ఐఎన్ఎస్ కోల్‌కతా 40 గంటల ఆపరేషన్ అనంతరం 35 మంది సముద్రపు దొంగలను బంధించింది. ఈ ఆపరేషన్‌లో ఐఎన్ఎస్ కోల్‌కతాకు సాయంగా ఐఎన్ఎస్ సుభద్ర, భారత వాయుసేన కూడా రంగంలోకి దిగి ఆపరేషన్‌ను పూర్తి చేశాయి. 35 మంది పైరేట్లతో అక్కడి నుంచి బయలుదేరిన నౌక ఈ ఉదయం ముంబై తీరం చేరుకుంది.

బెంగళూరు బాంబు పేలుడు కేసులో నిందితుడి గుర్తింపు

బెంగళూరు : బెంగళూరు రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు కేసులో ప్రధాన నిందితుడిని పోలీసులు గుర్తించారు. నిందితుడు ముస్సావిర్ షాజిబ్‌గా తేల్చారు. షాజిబ్ కర్ణాటకలోని శివమొగ్గ వాసిగా గుర్తించారు. పేలుడు అనంతరం చెన్నైలో స్నేహితుడితో కలిసి ఉంటున్నాడని పోలీసులు గుర్తించారు. స్నేహితుడు కూడా తమిళనాడులోని ఓ హత్య కేసులో మోస్ట్ వాంటెడ్ ముద్దాయని తెలిపారు. మార్చి 1న బాంబు పేలుడు జరగ్గా ఈ కేసును ఎన్ఐఎ దర్యాప్తు చేస్తోంది.


తొలుత ఖాతాలు తెరిచింది మూడు పార్టీలే

- ఎన్నికల బాండ్లపై ఎస్‌బిఐ

న్యూఢిల్లీ : ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాల కోసం 2018, మార్చి 31 నాటికి కేవలం మూడు పార్టీలు కరెంట్ ఎస్‌బీఐ కరెంట్ ఖాతాలు తెరిచాయి. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద రిటైర్డ్ కమోడోర్ లోకేశ్ బాత్ర దాఖలు చేసిన దరఖాస్తుకు స్పందిస్తూ ఎస్‌బిఐ వెల్లడించింది. ఎస్‌బిఐ సమాచారం ప్రకారం.. ఎన్నికల బాండ్లను నగదుగా మార్చుకునేందుకు (ఎన్‌క్యాష్‌మెంట్) కోసం 2018, మార్చి 31 నాటికి మూడు రాజకీయ పార్టీలు మాత్రమే ఖాతాలను తెరిచాయి. 2019, మార్చి 31 నాటికి ఈ సంఖ్య 14కు పెరిగింది. కొన్ని రోజులకు అదే ఏడాది ఏప్రిల్ 12న ఖాతాలు తెరిచిన రాజకీయ పార్టీల సంఖ్య 18కి చేరింది. 2020, మార్చి 31 నాటికి ఈ సంఖ్య 22కు చేరగా.. తర్వాతి ఏడాది మార్చి 31 వరకు అలాగే ఉన్నది. 2022, మార్చి 31 నాటికి 24, ఆ తర్వాత ఏడాది అదే తేదీ నాటికి 25 రాజకీయ పార్టీలు ఖాతాలను కలిగి ఉన్నాయి. ఈ నెల 21 నాటికి కూడా ఈ సంఖ్య ఇలాగే కొనసాగటం గమనార్హం.

ఎన్నికల వేళ బిజెపికి కోట్లు కుమ్మరింత

- 2019 లోక్‌సభ ఎన్నికల్లో కార్పొరేట్ కంపెనీల తీరు
- నాడు ఎన్నికల బాండ్లలో 93 శాతం నిధులు కమలానికే



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆదివాసీల హక్కులను హరించి, పర్యావరణ ధ్వంసానికి ఒడిగట్టి కార్పొరేట్ కంపెనీలకు భూములను, ప్రాజెక్టులను కట్టబడెతూ వచ్చిన కేంద్రంలోని అధికార బిజెపికి ఎన్నికలు వచ్చినప్పుడల్లా కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయలు విరాళాలుగా కుమ్మరిస్తూ వచ్చాయి. ఎన్నికల బాండ్లను ఇందుకు మార్గంగా మలుచుకున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కూడా కార్పొరేట్ కంపెనీలు ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి భారీగా నిధులు సమకూర్చాయి. అప్పుడు కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్లలో 93 శాతం నిధులు ఒక్క బిజెపికే చేరాయంటే కార్పొరేట్, బిజెపి దోస్తీని అర్థం చేసుకోవచ్చు.

2019 ఏప్రిల్ 12 నుంచి 2019 మే 10 మధ్య, 13 రాజకీయ పార్టీలు మొత్తం రూ. 2,902.87 కోట్ల ఎన్నికల బాండ్లను స్వీకరించాయి. వీటిలో అత్యధికం రూ.2,719.32 కోట్లు (93 శాతం) బిజెపి పొందింది. కాంగ్రెస్ కేవలం రూ.95.29 కోట్లు (3.2 శాతం) పొందింది. కాగా తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.36.2 కోట్లు, బిఆర్ఎస్‌కు రూ.13.6 కోట్లు, సమాజ్‌వాదీ పార్టీకి రూ.10 కోట్లు, శివసేనకు రూ.8.45 కోట్లు చొప్పున నిధులు సమకూరాయి. కలకత్తాకు చెందిన పారిశ్రామికవేత్త మహేంద్ర కుమార్ జలాన్ కి చెందిన సంస్థలు హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలకు అత్యధిక విరాళాలు అందించాయి. నాటి ఎన్నికల వేళ బిజెపికి కోట్లు కుమ్మరించిన సంస్థల్లో జలాన్‌కు చెందిన మదన్‌లాల్ లిమిటెడ్ రూ. 175.5 కోట్లు, కెవెంటర్ ఫుడ్ పార్క్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రూ. 144.5 కోట్లు, ఎంకెజె ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ రూ. 14.42 కోట్లు అగ్రస్థానంలో నిలిచాయి. 2019 ఏప్రిల్-మే మధ్య బిజెపికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ రూ.125 కోట్లు విరాళంగా సమర్పించుకుంది. ఈ కాలంలో బిజెపికి ఇతర అగ్ర దాతలలో వేదాంత లిమిటెడ్ రూ.52.65 కోట్లు, ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ. 50 కోట్లు, బజాజ్ గ్రూప్, పిహెచ్ఎల్ ఫిన్‌వెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ ఒక్కొక్కటి రూ. 40 కోట్లు విరాళంగా అందించాయి. పారిశ్రామికవేత్త లక్ష్మీ నివాస్ మిట్టల్ రూ.35 కోట్లు ఇవ్వగా, సన్ ఫార్మా లేబొరేటరీస్ లిమిటెడ్ రూ.31.5 కోట్లు ఇచ్చింది.

రియల్ ఎస్టేట్ సమ్మేళనం డిఎల్ఎఫ్ గ్రూప్ (డిఎల్ఎఫ్ కమర్షియల్ డెవలపర్స్ లిమిటెడ్, డిఎల్ఎఫ్ లగ్జరీ హెూమ్స్ లిమిటెడ్) ఎన్నికలకు ముందు బిజెపికి రూ.25 కోట్లు ఇచ్చింది. డిఎల్ఎఫ్ కేవలం బిజెపికి మాత్రమే ఇచ్చింది. 2019 జనవరిలో భూ కేటాయింపు కేసులో అవకతవకలు జరిగాయని ఆరోపించినందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) డిఎల్ఎఫ్ కార్యాలయాలు తనిఖీ నిర్వహించింది. 2019 ఏప్రిల్, మే మధ్య రూ. 25 కోట్లు విరాళం ఇచ్చింది. అదే సమయంలో, రిలయన్స్‌కి చెందిన ముఖేష్ అంబానీ అల్లుడు ఆనంద్ పిరమల్ డైరెక్టర్‌గా ఉన్న పిరమల్ గ్రూప్, పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ బిజెపికి రూ.20 కోట్లు ఇచ్చింది.

వ్యక్తిగత బాండ్లలోనూ 84 శాతం బిజెపికే

వ్యక్తిగతంగా కొనుగోలు చేసిన ఎన్నికల బాండ్లలో కూడా బిజెపికే అత్యధికం వెళ్లాయి. టాప్ 10 వ్యక్తిగత దాతలు 2019 ఏప్రిల్ 12, 2024 జనవరి 11 మధ్య టాప్ పది మంది వ్యక్తులు కొనుగోలు చేసిన బాండ్లలో 84 శాతం బిజెపి ఖాతాలో పడ్డాయి. మొదటి పది మంది వ్యక్తులు రూ.180.2 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేయగా అందులో రూ.152.2 కోట్లు (84.5) బిజెపికి వెళ్లాయి. బిజెపి తర్వాత అత్యధిక నిధులు తృణమూల్ కాంగ్రెస్ దక్కించుకుంది. ఆ పార్టీకి వ్యక్తిగత బాండ్ల ద్వారా రూ.16.2 కోట్లు (9 శాతం) అందాయి. ఆ తర్వాత స్థానంలో రూ.5 కోట్ల విరాళాలందుకొని బిఆర్ఎస్ నిలిచింది.

టాప్ 10 వ్యక్తిగత ఎన్నికల బాండ్ల కొనుగోలుదార్లలో అగ్రస్థానంలో ఉన్న ఆర్సెలర్ మిట్టల్ చైర్‌పర్సన్ లక్ష్మీ నివాస్ మిట్టల్ రూ.35 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశారు. ఇవన్నీ బిజెపికి విరాళంగా అందాయి. రెండోస్థానంలో ఉన్న లక్ష్మీ దాస్ వల్లభదాస్ మర్చెంట్ 2023 నవంబర్‌లో తన మొత్తం రూ.25 కోట్లను బిజెపికి విరాళంగా ఇచ్చారు. వీరి తర్వాతి స్థానాల్లో కెఆర్ రాజా జెటి, ఇందర్ ఠాకూర్‌దాస్ జైసింఘని, రాహుల్ జగన్నాథ్ జోషి, ఆయన కుమారుడు హర్మేష్ రాహుల్ జోషి, రాజు కుమార్ శర్మ, సౌరభ్ గుప్తా, అనితా హేమంత్ షా బిజెపికి విరాళాలు ఇచ్చారు.



దిండిగల్ సభకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు

కేంద్రంలో మార్పు ఖాయం

- 'ఇండియా' విజయభేరి తథ్యం
- 'దిండిగల్' సభలో ఫోరం నేతలు

చెన్నయ్ : ప్రజాస్వామ్య విలువలను మంటగలిపి అత్యంత నిరంకుశంగా పాలన సాగిస్తున్న కేంద్రంలోని అధికార బిజెపి ఈ ఎన్నికల్లో మట్టికరవడం ఖాయమని, 'ఇండియా' ఫోరం పార్టీలు విజయభేరి మోగించడం తథ్యమని పలువురు నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తమిళనాడులోని దిండిగల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి ఆర్ సచ్చిదానందన్‌కు మద్దతుగా 'ఇండియా' ఫోరం శనివారం భారీ ర్యాలీ నిర్వహించింది. ఒట్టెంఛత్రంలో నిర్వహించిన ఈ ఎన్నికల ప్రచార సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పి షణ్ముగం, రాష్ట్ర మంత్రులు ఐ పెరియస్వామి, ఎ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. కేంద్రంలో ప్రభుత్వ మార్పు ఖాయమని, 'ఇండియా' ఫోరం అధికారంలోకి రాగానే ఉపాధి పథకం కింద పనిదినాలను ఏడాదికి 150 రోజులకు



సభలో మాట్లాడుతున్న మంత్రి ఐ పెరియస్వామి

పెంచుతామని పెరియస్వామి తెలిపారు. రాష్ట్ర రవాణా సంస్థ నష్టాల్లో ఉన్నా కూడా ఇక్కడి ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తోందని తెలిపారు.

మరో మంత్రి ఎ చక్రపాణి మాట్లాడుతూ..స్టాలిన్ ప్రభుత్వం అమల్జేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సిఎఎ వంటి వినాశకర చర్యలతో ప్రజల మధ్య చిచ్చు రాజేస్తున్న మోడీ సర్కార్‌ను గద్దె దింపి ప్రజాతంత్ర శక్తులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె కనగరాజ్, మతుకుర్ రామలింగం, కె బాలభారతి, ఎన్ పాండి తదితరులు పాల్గొన్నారు.

మేఘాలయలో మత విద్వేష జాడ్యం

- చర్చిలపై విపిపి అనుచిత వ్యాఖ్యలు

గువహటి : మేఘాలయలో మత విద్వేషాలు రాజేసి లబ్ధి పొందేందుకు సంఘ్ పరివార్ కుయుక్తులకు తెరలేపింది. చర్చి పెద్దలపై స్థానిక ప్రాంతీయ పార్టీ వాయిస్ ఆఫ్ ది పీపుల్ పార్టీ (విపిపి) ఇటీవల అనుచిత వ్యాఖ్యలు చేసింది. బిజెపి దిశానిర్దేశంలోనే ఇలాంటి దుర్మార్గపు చర్యలకు విపిపి తెగించిందని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల్లో చీలికలు తీసుకొచ్చేందుకు బిజెపి, దానితో అంటగాకుతున్న పార్టీలు విద్వేష జాడ్యాన్ని ప్రదర్శిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ 19న మేఘాలయలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో చర్చిలపై విపిపి చేసిన ఆరోపణలు, దూషణలతో దుమారం చెలరేగుతోంది. 'కొంతమంది చర్చి పెద్దలు ఓటర్లను ప్రభావితం చేసేందుకు మద్యాన్ని పంపిణీ చేస్తున్నారు' అని విపిపి ఇటీవల వ్యాఖ్యలు చేసింది. విపిపి భావజాలం, బిజెపి భావజాలం ఒకటేనంటూ కాంగ్రెస్ విమర్శించింది. ప్రార్థన మందిరాల ప్రతిష్టలను విపిపి తీవ్రంగా దెబ్బతీసిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు విన్సెంట్ పాలా విమర్శించారు. అనవసరమైన మాటలతో రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించడాన్ని ఆపాలని కోరారు. నిరసనలు వెల్లువెత్తడంతో విపిపి అధ్యక్షులు ఆర్డెంట్ మిల్లర్ వివరణ ఇచ్చారు. 'మేము ఎవరినీ నిందించలేదు. పరిశుద్ధ రాజకీయాల కోసం పోరాడే పార్టీగా విలువల పతనం గురించి ప్రజల దృష్టికి తీసుకువచ్చాం అంతే' అని చెప్పారు.

జర్మనీ తీరుపై కేంద్రం నిరసన

న్యూఢిల్లీ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుపై జర్మనీ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యలకు భారత్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీలోని జర్మనీ రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ జార్జి ఎన్జ్‌వెయిలర్‌ను పిలిపించి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. కేజ్రీవాల్ అరెస్టుకు సంబంధించి జర్మనీ విదేశాంగ శాఖ చేసిన వ్యాఖ్యలు భారతదేశ అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే అవుతుందని, అలాంటి చర్యలు వద్దు అని, పక్షపాతంతో కూడిన భావనలు అత్యంత ప్రమాదకరమైనవి, అవాంఛనీయమైనవని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

లూలాను ఈ రొంపిలోకి లాగుతారా?

రాష్ట్రంలో సంచలనం రేపుతున్న భారీ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసులో పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలతో తెలుగుదేశం- బిజెపి కూటమి, వైసిపిలు రెండూ ప్రజలను గందరగోళంలోకి నెడుతున్నాయి. ఈ క్రమంలోనే దీంతో ఎలాంటి సంబంధం లేని ప్రపంచ అగ్ర నేతల్లో ఒకరైన బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా పేరును ఈ రొంపి లోపికి లాగడం పలువురిని ఆశ్చర్యపరచింది. ఈ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కేసుకి లూలాకు సంబంధమేమిటి? ప్రపంచంలో అతి పెద్ద దేశాల్లో ఒకటైన బ్రెజిల్‌లో సైనిక నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన యోధుడు, 180 రోజులు డ్రగ్స్ మాఫియా, ఆయుధాల అక్రమ రవాణా ముఠాలపై యుద్ధం ప్రకటించిన అశేష ప్రజాదరణ కలిగిన నాయకుడు లూలా డ సిల్వా ప్రస్తుతం జి-20 కూటమికి నేతృత్వం వహిస్తున్నాడు. అటువంటి నేతను కించపరిచే విధంగా రాష్ట్రంలోని కొందరు రాజకీయ ప్రబుద్ధులు వ్యాఖ్యలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యం. 78 ఏళ్ల ఈ వామపక్షవాది అనేక నిర్బంధాలను ఎదుర్కొని 2022 అధ్యక్ష ఎన్నికల్లో తిరగులేని విజయం సాధించి బ్రెజిల్ అధ్యక్ష పీఠాన్ని అధిష్టించినప్పుడు ప్రపంచ దేశాల నేతలు, వామపక్ష పార్టీల నేతలు, ప్రగతిశీల సంస్థలు, అభినందనలు తెలిపాయి. అందులో భాగంగా మన దేశ ప్రధాని కూడా అభినందనలు తెలిపారు. ఆ క్రమంలోనే ఇక్కడి రాజకీయ పార్టీలకు చెందిన నేతలు కొందరు ఆయనను అభినందించి ఉంటారు. దీనిని స్వాగతించడానికి బదులు కించపరిచేలా మాట్లాడడం తగని పని.

బ్రెజిల్ ఏదో మారుమూల ఉన్న అనామక దేశమేమీ



సంధ్య ఆక్వా పరిశ్రమ వద్ద దాడులు నిర్వహిస్తున్న సిబిఐ అధికారులు (ఫైల్)

కాదు. బ్రిక్స్ కూటమిలో భాగస్వామిగా ఉంది. లాటిన్ అమెరికా దేశాల వామపక్ష ప్రగతి శీల శక్తులకు స్ఫూర్తి నిస్తున్న బ్రెజిల్‌ను మాదక ద్రవ్యాలు, అక్రమ ఆయుధ రవాణా, డెత్ స్క్వాడ్‌లు వంటి వ్యవస్థీకృత నేరాలకు అడ్డాగా ట్రంప్, బోల్సనారో జోడీ మార్చేసింది. 2003 నుంచి 2010 వరకు పదేళ్ల పాటు బ్రెజిల్ అధ్యక్షుడిగా పనిచేసి, మళ్లీ 2023 జనవరి 1న ఆ దేశ 39 వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన లూలా బ్రెజిల్‌ను డ్రగ్స్ మాఫియా, తుపాకుల అక్రమ రవాణా గ్యాంగ్‌లు, కిరాయి హంతక ముఠాల నుంచి విముక్తి చేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాడు. సైనిక, నేవీ, వైమానిక దళాలతో కూడిన సంయుక్త ఆపరేషన్‌ను ప్రారంభించారు. కొకైన్, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే మాఫియాలపై ఉక్కుపాదం మోపారు. విమానాశ్రయాలు, ఓడరేవులు అన్నిట్లోను ఆపరేషన్ నిర్వహించారు. గత ఏడాది ఒక్క సెప్టెంబరులోనే పశ్చిమ రియో ప్రాంతంలో భారీగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వ్యవస్థీకృత నేరాలు ఎక్కువగా చోటుచేసుకునే బ్రెజిల్ పశ్చిమ తీర ప్రాంతంలో డ్రగ్స్ మాఫియాలు, హంతక ముఠాల పీచమణిచేలా భారీగా సాయుధ బలగాలను పంపారు. లూలా అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ముందు రోజున బ్రెజిల్ రాజధానిలో పెద్దయెత్తున హింసకు పాల్పడిన బోల్సనారో ప్రేరేపిత గ్యాంగ్‌ల్లో ఈ మాఫియాల పాత్ర కూడా ఉంది. సైనిక నియంతృత్వ ప్రభుత్వాల హయాంలో పనిచేసిన మాజీ సైనిక అధికారులు, సైనికులు ఎక్కువగా ఈ మాఫియాలను నడుపుతున్నారు. మాజీ అధ్యక్షుడు బోల్సనారో కూడా మాజీ సైనిక అధికారే. ఆయనకు, అయన కుటుంబానికి ఈ ముఠాలతో సంబంధాలున్నాయనే విషయాన్ని టైమ్స్ పత్రిక 2022లో ఓ ప్రత్యేక కథనంలో వెల్లడించింది. ఈ ముఠా సభ్యులు బోల్సనారోను కెప్టెన్ అని ముద్దుగా పిలుస్తారు. వీటిని ఎదిరించినందుకు లూలాపై తప్పుడు కేసు బనాయించి జైలులో పెట్టారు.

2018 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హుడిగా ప్రకటించారు. 2022లో సుప్రీం కోర్టు ఆయనపై కేసును కొట్టివేసి, శిక్షను రద్దు చేసింది. బ్రెజిల్‌లో నిరంకుశ, అరాచక పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్యాన్ని పునఃప్రతిష్టించేందుకు యత్నించిన నేత లూలా డసిల్వా ఎవరో ప్రపంచానికంతటికీ తెలుసు. అటువంటి వ్యక్తిని ఎవరికీ తెలియని నాయకుడని, ఆయనను అభినందిస్తూ ఇక్కడి ఎంపీ అభినందనలు తెలపడమేమిటని చౌకబారు వ్యాఖ్యలు చేయడం వల్ల లూలా ప్రతిష్ట ఏమీ తగ్గిపోదు. ఆ వ్యాఖ్యలు చేసిన నేతల నీతిమాలినతనాన్ని చూసి ప్రజలు ఏవగించుకుంటారు. ఇప్పటికైనా ఈ డ్రగ్స్ మాఫియా వ్యవహారంలోకి ఆ అంతర్జాతీయ యోధుణ్ణి లాగడం మానుకుని అసలు దోషులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తే మంచిది.

(ఫీచర్స్ అండ్ పొలిటిక్స్)



అభివాదం చేస్తున్న విజయన్, ఎలమారం కరీం, శైలజా టీచర్

సిఎఎపై పోరులో కాంగ్రెస్ వాణి ఏది?

- నిలదీసిన విజయన్

తిరువనంతపురం : పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై పోరాటంలో కాంగ్రెస్ వాణి తగినంతగా వినిపించడం లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సిఎఎ సాకుతో దేశంలో మతోన్మాద ధోరణులను రెచ్చగొట్టడానికి మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. కేరళలో చేపట్టిన ఎన్నికల ప్రచారం సిఎఎపై ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా రూపుదిద్దుకుంటోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగానే ఎల్‌డిఎఫ్ నేతృత్వంలో సిఎఎ వ్యతిరేక నిరసనలు ఉధృతంగా జరుగుతున్నాయి. వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. ఆందోళనలు చేస్తున్నారు. ఈ దిశగా మొదటగా భరణఘటన సంరక్షణ సమితి (రాజ్యాంగ పరిరక్షణ కమిటీ) ఆధ్వర్యంలో ఐదు రాత్రివేళ సభలు నిర్వహించనున్నారు. వీటిలో మొదటిది కొజికోడ్‌లో శుక్రవారం నిర్వహించగా..ఆ ర్యాలీకి లక్షలాది మంది హాజరయ్యారు. రెండో సభ కాసరగడ్ జిల్లాలోని కన్హన్‌గడ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ ముస్లింలను రెండో తరగతి పౌరులుగా వ్యవహరించడాన్ని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ పోరాటలో వామపక్షాలను మాత్రమే విశ్వసించగలమన్నారు. సిఎఎపై పోరులో కేరళ ప్రభుత్వం అగ్ర భాగాన వుంటుందన్నారు. కేరళ నుండి గెలిచిన లోక్‌సభ సభ్యుల్లో కేవలం ఎఎం అరిఫ్ మాత్రమే దిగువ సభలో తన వాణి వినిపించారని అన్నారు. రాజ్యసభలో ఎలమరమ్ కరీం, వినయ్ విశ్వం, కెకె రాజేష్‌లు బిల్లును వ్యతిరేకించారని చెప్పారు. కాంగ్రెస్ నేతలు ఎక్కడా కూడా తమ వాణిని వినిపించలేదన్నారు. ఢిల్లీలో సిఎఎకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పుడు .. ఆందోళనకారులను కాల్చివేయాలని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్ నినాదాలు చేశారని, దీనిపై సిపిఎం నేత బృందాకరత్ కోర్టుకు వెళ్లారని గుర్తు చేశారు. ఈ పోరాటంలో కాంగ్రెస్ ఎక్కడుందో చెప్పాలని ఆయన నిలదీశారు. సిఎఎపై ప్రజాతంత్ర శక్తులన్నీ ఒక్కతాటిపై నిలిచి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

మద్యం కేసులో కవితకు ఇడి కస్టడీ పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం, మనీలాండరింగ్ కేసుల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు రౌస్ ఎవెన్యూ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కస్టడీని మరో మూడు రోజులు పొడగించింది. ఈ నెల 26న ఉదయం 11 గంటల లోపు తిరిగి కోర్టు ముందు హాజరుపరచాలని ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ఆదేశాలు జారీ చేశారు. విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, సిసిటివిల కింద విచారణ నిర్వహించాలని స్పష్టం చేసింది. కవిత కోరిక మేరకు ఇంటి భోజనానికి కోర్టు అనుమతించింది. భర్త అనిల్, సోదరుడు కెటిఆర్ తదితర కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు అనుమతులు మంజూరు చేసింది. ఏడు రోజుల కస్టడీ శనివారంతో ముగియడంతో కవితను ఇడి అధికారులు సిబిఐ ప్రత్యేక కోర్టు ముందు హజరుపరిచారు. ఇడి తరపున న్యాయవాది జోసెబ్ హుస్సేన్ వాదనలు వినిపిస్తూ...రూ.100 కోట్ల అక్రమ చెల్లింపులకు సంబంధించి కవిత కుట్ర పన్నారని ఆరోపించారు. ఈ కేసులో మరో నలుగురి వాంగ్మూలాలు తీసుకొని, కలిపి ప్రశ్నించినట్లు తెలిపారు. కవిత నివాసంలో సోదాల సందర్భంగా ఫోన్ సీజ్ చేసామని, అనుమానస్పద రీతిలో ఉన్న కవిత మేనల్లుడు విచారణకు హాజరు కాలేదని కోర్టుకు నివేదించారు. ఇక్కడ వాదనలు జరుగుతోన్న సమయంలోనే హైదరాబాద్ లోని కవిత కుటుంబ సభ్యుల నివాసంలో సోదాలు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో మరింత సమాచారం రాబట్టాల్సిన ఉన్నందున... కవితను మరో ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని జోసెబ్ విజ్ఞప్తి చేశారు. మూడు రోజులు కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.

ధైర్యంగా ఉండండీ...:కవిత

కోర్టు అనుమతించడంతో కుటుంబ సభ్యులు, ఎంపిలు, మాజీ మంత్రులుతో కోర్టు హాల్‌లోనే కవిత కాసేపు ముచ్చటించారు. ఆమెను చూసి మాలోతు కవిత, సత్యవతి రాథోడ్, కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. దీంతో వారందరిని దగ్గరికితీసుకున్న కవిత, 'ఏడ్వొద్దు. భయపడాల్సిన అవసరం లేదు. ధైర్యంగా ఉండండి. మీరంతా ఉండగా నాకేం కాదు. మీరంతా వచ్చినందుకు ధన్యవాదాలు' అని తెలిపారు.

హైదరాబాద్‌లో ఇడి సోదాలు

మరోవైపు ఎమ్మెల్సీ కవిత బంధువుల నివాసాల్లో శనివారం ఇడి అధికారులు సోదాలు చేపట్టారు. మాదాపూర్‌లోని కవిత ఆడపడుచు అఖిల ఇంట్లో సోదాలు చేశారు. ఉదయం 10 గంటల సమయంలో అఖిల ఇంటికి వచ్చిన ఇడి బృందం రాత్రి ఏడు గంటల వరకు సోదాలు నిర్వహించారు. కవిత అల్లుడు శరణ్ పాత్రపై కూడా ఇడి అధికారులు ఆరా తీశారు. కవిత కార్యాలయ సిబ్బందిని కూడా ఇడి ప్రశ్నించే అవకాశం ఉంది. మరోవైపు, వారం రోజుల కస్టడీ ముగియడంతో ఎమ్మెల్సీ కవితను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ సిబిఐ ప్రత్యేక కోర్టులో శనివారం ఇడి హాజరుపరిచింది. ఆమెను మరో ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని దర్యాప్తు అధికారులు కోర్టును కోరారు. కేసు దర్యాప్తు పురోగతిని ఇడి న్యాయవాది కోర్టుకు వివరించారు. మరికొందరితో కలిపి ఆమెను ప్రశ్నించాల్సి ఉందని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. కవిత కస్టడీని మరో మూడు రోజులు పొడిగించింది.

ఆప్ ఆఫీస్‌కు సీల్

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కాగా, లిక్కర్ పాలసీ కేసులో గత ఏడాది నవంబర్‌లో ఈడీ అరెస్ట్ చేసిన అరబిందో ఫార్మాకు చెందిన శరత్ చంద్రా రెడ్డి వాంగ్మూలం ఆధారంగా ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని మంత్రి అతిషి తెలిపారు. కేజ్రీవాల్‌ను తాను ఎప్పుడూ కలవలేదని, మాట్లాడలేదని, ఆప్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని శరత్ చంద్రారెడ్డి గతంలో స్పష్టంగా చెప్పారన్నారు. అయితే చాలా కాలం జైలులో ఉన్న తర్వాత అప్రూవర్‌గా మారిన ఆయన తన స్టేట్‌మెంట్‌ను మార్చారని ఆమె ఆరోపించారు.

మరోవైపు లిక్కర్ పాలసీ కేసుకు సంబంధించిన డబ్బు ఎక్కడుంది? ఆ మనీ జాడ ఎక్కడ? అని మంత్రి అతిషి ప్రశ్నించారు. ఆ డబ్బు బిజెపి బ్యాంకు ఖాతాలోకి వెళ్లిందని ఆమె ఆరోపించారు. 'ఆయన (శరత్ చంద్రా రెడ్డి) రూ. 4.5 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌లు బిజెపికి ఇచ్చాడు. ఆ తరువాత రూ. 55 కోట్ల విలువైన బాండ్లను కూడా ఇచ్చాడు. లిక్కర్ స్కామ్ నిందితుడి డబ్బులు బిజెపి ఖాతాలో కనిపించాయి. ప్రధాని మోడీ, ఈడికి నేను సవాల్ చేస్తున్నా. బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డాను అరెస్టు చేయాలి' అని అతిషి డిమాండ్ చేశారు.

గుజరాత్ ఇంచార్జ్, ఆప్ ఎమ్మెల్యే ఇంటిపై ఇడి దాడి

ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్ యాదవ్ ఇంటిపై ఈడి దాడి చేసింది. ప్రస్తుతం ఈడి అధికారులు ఆయన నివాసంలో సోదాలు నిర్వహిస్తున్నారు. కాగా, ఈడీ దాడులపై ఆప్ నాయకుడు, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రతిపక్షాన్నే జైలుకు పంపించాలని కృతనిశ్చయంతో ఉన్నట్లు దేశ ప్రజలకే కాదు మొత్తం ప్రపంచానికి అర్థమైందని చెప్పారు. ప్రస్తుతం ఈ దేశం రష్యా అడుగు జాడల్లో నడుస్తున్నదని, ఇదే విధంగా బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఉత్తర కొరియాలో కూడా జరిగిందని తెలిపారు. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల ప్రాథమిక హక్కుల హననంతోపాటు ప్రతిపక్షాలను అంతమొందించడంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ప్రస్తుతం నియంతృత్వంలోకి వెళ్తున్నదని విమర్శించారు. ఓ అక్రమ కేసులో తమ పార్టీ చెందిన నలుగురు అగ్రనాయకులు ప్రస్తుతం జైలులో ఉన్నారని చెప్పారు. తాము గుజరాత్‌లోని పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్నామని, ఈ నేపథ్యంలోనే ఆ రాష్ట్రానికి ఇంచార్జ్‌గా ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్‌పై ఈడి దాడులు నిర్వహిస్తున్నదని విమర్శించారు. ఇలాగే మౌనంగా ఉంటే ఆప్‌తో పాటు ఇతర ప్రతిపక్ష నాయకులపై దాడులు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

ఆ పోలీసు అధికారి నాతో దురుసుగా ప్రవర్తించాడు: కేజ్రీవాల్

ఢిల్లీ పోలీసు అధికారి ఒకరు తనతో దురుసుగా ప్రవర్తించారని ఢిల్లీ సిఎం, ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. గతంలో కోర్టు ఆవరణలో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా పట్ల దురుసుగా ప్రవర్తించింది కూడా ఈ పోలీసు అధికారే అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయనను తన భద్రతా వలయంలోని సిబ్బంది నుంచి తొలగించాలని ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టును కోరారు. ఈ మేరకు కోర్టులో దరఖాస్తు దాఖలు చేశారు. లిక్కర్ పాలసీ కేసులో రిమాండ్ దరఖాస్తుపై విచారణ నిమిత్తం ఈడి అధికారులు కోర్టుకు తీసుకెళ్తున్న సమయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎకె సింగ్ తనతో దురుసుగా ప్రవర్తించారని దరఖాస్తులో పేర్కొన్నారు. అయితే ఈడి సిబ్బంది మాత్రం తనతో మర్యాదగానే వ్యవహరించారని వెల్లడించారు. కాగా, గతేడాది ఇదే కోర్టు ఆవరణలో విలేకరులు సిసోడియాను ప్రశ్నిస్తున్న సమయంలో ఎకె సింగ్ తన మెడ పట్టుకుని బలవంతంగా నెట్టారు. దీనిపై సిసోడియా ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఎకె సింగ్ చర్యను ఢిల్లీ పోలీసులు సమర్థించారు.



మీ కోసం

వడియాలు పెట్టేటప్పుడు పిండి ఉడికిన తర్వాత కొద్దిగా మజ్జిగ కలిపితే, వడియాలు తెల్లగా వస్తాయి.

జీవన సౌరభం

అన్ని విషయాల గురించి తెలుసుకునేలా చేసేది జ్ఞానం. ఎంతవరకు గుర్తుంచుకోవాలో ఎంతవరకు వదిలేయాలో తెలిపేది వివేకం. అయితే వివేకం లేని జ్ఞానం వ్యర్థం.

ఎండ తాపము



ఎండలు ఎండలు ఎండలు
మెండుగ కాచే ఎండలు
భగభగ మండే ఎండలు
మలమల మాడ్చే ఎండలు!

మట్టి పాత్రలో నీటిని పోసి
పక్షుల దాహం తీరుద్దాం!
చలివేంద్రాలు పెట్టించి
మనుషుల దప్పిక తీర్చేద్దాం!

నీడనిచ్చే మొక్కలు నాటి
జీవుల అలసట పోగొడదాం
పిల్ల గాలుల కొలనుల్లో
చల్లగ స్నానం చేసేద్దాం

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని
ఊరువాడా చాటేద్దాం
కొండా కోన, జలపాతాలు,
ప్రకృతి వరమని నినదిద్దాం

అటవీ సంపద పరిరక్షించి
వానలు మెండుగ పొందేద్దాం
చురచురలాడే ఎండతాపము
ఒంటి చేత్తో తరిమేద్దాం!

- గుడ్ల అమ్మాజీ,
పార్వతీపురం, 73864 08306

6	+		=	14
+		+		+
	+	9	=	
=		=		=
	+	17	=	30

సరైన అంకెలు వేయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బాక్సులో ఒక్కో వరుసకు ఒక్కో జవాబు వచ్చేలా కొన్ని అంకెలు ఇచ్చాం. ఇచ్చిన క్లూ ఆధారంగా ఖాళీ గడుల్లో సరైన అంకెలు వేయండి.

నేను గీసిన బొమ్మ



బాస భవిజ్ఞ,
5వ తరగతి,
లారెల్ హై స్కూల్,
కరీంనగర్.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రంగస్థలమే ఊపిరిగా ...



ఆహార్యంలో నిండుదనం... సంభాషణల్లో స్పష్టత వెరసి రంగస్థలంపై ఆయన శైలి వినూత్నం. 71 ఏళ్ళ వయస్సులో సైతం కళారంగం కోసం అలుపెరుగక కృషి చేస్తున్న అవిశ్రాంత కళాకారుడు. ఆయనే గత 49 సంవత్సరాలుగా నాటకరంగమే ఊపిరిగా ముందడుగు వేస్తున్న కళామతల్లి ముద్దుబిడ్డ నాయుడు గోపి. సామాజిక అంశాలే ఇతివృత్తంగా, జనజాగృతే లక్ష్యంగా ఆయన ప్రదర్శించిన ఎన్నో నాటికలు, నాటకాలూ ఎంతో ప్రాచుర్యం పొందాయి. 1990లో గ్రామీణ కళాకారులతో 'గంగోత్రి' నాటక సమాజాన్ని స్థాపించిన నాటి నుంచి నేటి వరకూ ప్రజల్లో సామాజిక చైతన్యం కోసం కృషిచేస్తున్నారు. ఎందరో యువ కళాకారులను ప్రోత్సహించారు. రచయితగా, నటుడుగా, ప్రయోక్తగా, దర్శకుడిగా అనేక రూపాల్లో రంగస్థలానికి విస్తారమైన సేవలు అందించారు. ఈనెల 27 రంగస్థల దినోత్సవం సందర్భంగా ఆయనతో 'జీవన' ముచ్చటించింది.



గుంటూరు జిల్లా అమరావతి మండలం యండ్రాయి గ్రామంలో 1953 మార్చి 17న నాయుడు ప్రకాశరావు, కమలమ్మ దంపతులకు నాయుడు గోపి జన్మించారు. చిన్నప్పుడే నటనపై ఉన్న ఆసక్తితో 'సన్యాసం' అనే నాటకంలో నటించారు. 1981లో ఇసుకపల్లి మోహనరావు రచించిన 'డియర్ ఆడియన్స్ అండ్ సిన్సియర్ లీవర్' అనే రంగస్థల ప్రదర్శనతో ఆయన తొలిసారిగా నటుడిగా పరిచయమయ్యారు. గుంటూరు శాస్త్రి దగ్గర శిష్యరికం చేశారు. పడమటి గాలి, తర్జన, దహతి మానసం వంటి నాటకాల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారు. 'తర్జన'లో నిరుద్యోగ యువకుడి పాత్రలో చదువుకున్న యువతకు ఉద్యోగాలలేమిని పట్టి చూపినందుకుగాను ఆయన నటనకు 1984లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్నారు. 'గంగోత్రి' రంగస్థల సంస్థ ద్వారా నిషిద్ధాక్షరి, మానస సరోవరం వంటి అనేక నాటకాల్లో నటించారు. ప్రజాతీర్పు, యూనియన్ లీడర్, లీడర్, దమ్ము, దృశ్యం, ఖైదీనం.150, శేషాద్రి నాయుడు, మహాత్మా, నేనున్నాను వంటి 22 సినిమాల్లో నటించారు. నేనున్నానులో శ్రేయకు పక్షవాతం వచ్చిన తండ్రిగా, మహాత్మలో లాయర్‌గా, యాత్రలో రైతు పాత్రను పోషించారు.

కళామతల్లి ముద్దుబిడ్డగా ...

సామాజిక మార్పులకు కళలు ఎంతో దోహదపడతాయని భావించి ఆ రంగంలో కృషి చేస్తున్నారు నాయుడు గోపి. ప్రపంచీకరణ ప్రమాదాన్ని ఎత్తిచూపి భాషలు, కళలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణపై దృష్టి కేంద్రీకరించి పలు కళారూపాల ప్రదర్శనలకు ప్రాధాన్యత ఇచ్చారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం, అంటరానితనం, ఎయిడ్స్, పర్యావరణం తదితర అంశాలను ప్రజలకు వివరించి వాటికి పరిష్కార మార్గాలు కళారూపాల ద్వారా చూపించారు. సాంఘిక దురాచారాలు పోవాలనీ, మనిషిని సమానత్వంగా గుర్తించాలని తన నాటకాల ద్వారా ఆకాంక్షిస్తారు గోపి. తాను రాసిన నాటికలను పిల్లలతో, యువతతో ప్రదర్శింపచేసి వారిలో కూడా కళల పట్ల వారు అభిమానం పెంచుకునేలా చేస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటుగా బరంపురం, ఖరగ్‌పూర్, భిలాయ్, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. గంగోత్రి సమాజం, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా రీసోర్స్ సెంటరు-బెంగుళూరు వారి సౌజన్యంతో థియేటర్ టెక్నికల్ వర్క్‌షాపు నిర్వహించి ఔత్సాహిక కళాకారులకు శిక్షణ ఇప్పించారు.

బంగారు నందులకు కేరాఫ్‌గా ...

ప్రముఖ నటుడు, దర్శకుడు, రచయిత కెఎస్‌టి సాయి దగ్గర నటనలో ఓనమాలు దిద్దారు నాయుడు గోపి. ఆ తర్వాత 1980లో 'శాస్త్రీయం-గుంటూరు', 'స్పందన-ఒంగోలు', 'వేమన ఆర్ట్స్- గుంటూరు' మొదలైన నాటక సమాజాల్లో ఎన్నో వేషాలు వేస్తూ నటుడిగా ఒక్కో మెట్టు ఎక్కారు. దర్శకుడిగా ఎదుగుదలకు జిఎస్‌ఆర్‌కె శాస్త్రి కారణమైతే, నటుడిగా గుర్తింపు రావటానికి తోడ్పడిన వ్యక్తి వేముల మోహనరావు. 1989 వరకు రంగస్థలంపై నిరాటంకంగా నటిస్తున్న సమయంలో తను నటిస్తున్న సమాజాల్లోని నటులు సినిమాల్లో అవకాశాల కోసం వెళ్లిపోతున్నారు. అప్పట్లో నాటక ప్రదర్శనలు కుంటుపడ్డాయి. దాదాపు ఏడాదిపాటు ఏకాకిగా ఉండిపోయారు.





'గంగోత్రి'తో ఎన్నో ప్రయోగాలు

1990 జనవరిలో మిత్రుడు ఆనంద్ సలహా మేరకు 'గంగోత్రి' పేరుతో నాటక సమాజాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నేటి వరకూ నాటక ప్రదర్శనలను కొనసాగిస్తూనే ఉన్నారు. సిహెచ్ రజితమూర్తి, పెండెంట కోటేశ్వరరావు, బి.బాబూరావు, పి.సాంబిరెడ్డి, పి.నాగిరెడ్డి, డి.నాగేశ్వరరావు, ఎస్.లక్ష్మిల సూచనలతో ముందుకు సాగారు.

'మానస సరోవరం' నాటకంతో ఆయన దర్శకుడిగా మారారు. వెనిగండ్ల గ్రామంలో గంగోత్రి ద్వారా తొలి ప్రదర్శన 1990 ఏప్రిల్ 9న ఇవ్వగా, అప్పటివరకూ జరుగుతున్న మేనరికపు పెళ్లిళ్లకు చాలాచోట్ల ఫుల్‌స్టాప్ పడింది. ఆనందరావు రాసిన 'కాదు సుమా కల', 'నీతిచంద్రిక' నాటకాలు కూడా నాయుడు గోపికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి.

నాటిక ప్రదర్శనల్లోనూ మేటిగా...

ఆనందరావు రాసిన నాటిక 'దర్పణం', మడభూషి దివాకర్‌బాబు రచించిన 'దహతి మమ మానసం' నాటిక ప్రదర్శనలు కూడా ప్రేక్షకుల మన్ననలు పొందాయి.

హైదరాబాద్‌కు చెందిన వంశీ నిరంజన్ కళాకేంద్రం 'నవ్వండి విషాదం' రచయిత సత్యనాథం అంగీకారంతో దాదాపు 50 ప్రదర్శనలు ఇచ్చారు. ఆ తర్వాత యద్భవిష్యం, శ్వేతపత్రం, లజ్జ, శ్రీముఖ వ్యాఘ్రం, శ్రీ చక్రం, హింసధ్వని, భూమిపుత్రుడు, పడమటి గాలి, వానప్రస్థం, ఎడారికోయిల, ఓనమాలు, భారతరత్న, ఆంబోతు వంటి సాంఘిక నాటికలు, నాటకాలే కాకుండా పల్నాటి భారతం, హంసగీతం, శ్రీ వేమన వంటి పద్యనాటకాలకు కూడా దర్శకత్వం వహించారు. విద్యాధర్ మునిపల్లి రచించిన 'గమనం' నాటిక, శ్రీ గురు రాఘవేంద్ర చరితం' పద్య నాటకాన్ని అనేక చోట్ల ప్రదర్శించారు. దాని ద్వారా కాంస్య నందిని అందుకున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

2000కుపైగా నాటక ప్రదర్శనలు

1975లో నట జీవితాన్ని ప్రారంభించాను. 1990 నుంచి ఆలిండియా రేడియో ఆర్టిస్ట్‌గా పనిచేశాను. 2000లకు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చాం. ఉత్తమ నటుడిగా 600 వరకు, ఉత్తమ దర్శకుడిగా 400 బహుమతులు అందుకున్నా. వందలాది కళాసంస్థలు అవార్డులతో సత్కారాలు, వేలాది సన్మానాలను అందుకున్నాను. పలు సంస్థల్లో అనేక పదవులను నిర్వహిస్తున్నాను. సెంట్రల్ సెన్సార్‌బోర్డు సభ్యుడిగా పనిచేశాను. 2022లో రాష్ట్ర ప్రభుత్వ వైఎస్సార్ లైఫ్ ఎచీవ్‌మెంట్ అవార్డు, 2023లో నాటక నంది అవార్డులను అందుకున్నా.

- నాయుడు గోపి, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్,
ప్రముఖ రంగస్థల నాటకరంగ ప్రముఖులు, పెదకాకాని, గుంటూరు జిల్లా.



చిరంజీవికి ఘన సత్కారం

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఆహా సంస్థలు సంయుక్తంగా 9వ సౌత్ ఇండియా ఫిలిం ఫెస్టివల్‌ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించాయి. హీరో చిరంజీవి ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశంలోనే రెండో అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ వచ్చినందుకుగాను సినీ ప్రముఖులు చిరంజీవిని ఘనంగా సత్కరించారు. ఆంజనేయ ప్రతిమను మురళీమోహన్, అల్లు అరవింద్, టీజీ విశ్వప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ నుంచి అల్లు శిరీష్ వరకూ ఇండస్ట్రీకి రావటానికి చిరంజీవి కారణమని అన్నారు. అందరూ ఆయన బాటలో నడుస్తూ కెరీర్‌ను నిర్మించుకున్నారన్నారు. చిరంజీవి తన కెరీర్, ఎదుర్కొన్న సవాళ్లు గురించి వివరించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చావేదికలో సినీ ప్రముఖులు, విమర్శకులు, విశ్లేషకులు పాల్గొన్నారు. నిర్మాత స్వప్నదత్, ఎస్‌కేఎన్, సుస్మితా కొణిదెల, ఆనంద్ దేవరకొండ తదితరులు పాల్గొని తమ చిత్రాల విశేషాలను పంచుకున్నారు. యువనటీనటులు సందడి చేశారు. తేజా సజ్జా డ్యాన్స్‌తో అలరించారు. ఈ కార్యక్రమాల్లో మణిశర్మ, తనికెళ్ల భరణి, కెఎస్ రామారావు, మంచు లక్ష్మి, టీజీ వెంకటేష్‌తోపాటుగా పలు భాషలకు చెందిన సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

జులైలో టాలీవుడ్ 90 ఏళ్ల వేడుకలు



తెలుగు సినిమా పరిశ్రమ 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా మలేషియా వేదికగా జులైలో వేడుకలు నిర్వహిస్తామని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షులు మంచు విష్ణు వెల్లడించారు. హైదరాబాద్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వేడుకల గురించి త్వరలోనే సినీ పెద్దలతో చర్చిస్తామన్నారు. వారి ఆశీస్సుల మేరకు త్వరలోనే తేదీని ప్రకటిస్తామన్నారు. ఈ మేరకు జులైలో మూడురోజులపాటు షూటింగ్‌లకు సెలవులు ఇవ్వాలని కోరామన్నారు. ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు దిల్‌రాజు సానుకూలంగా స్పందించారన్నారు. దేశంలోని ఐదు అసోసియేషన్లతో 'మా' ఒప్పందం చేసుకుందన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ ఘనకీర్తిని చాటిచెప్పేందుకు ఈ వేడుకలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ ఇప్పుడు గొప్ప దశలో ఉందన్నారు. ఈ సమయంలో నటీనటులుగా ఉన్నందున గర్వపడుతున్నానన్నారు. చిరంజీవికి పద్మవిభూషణ్ రావటం గర్వించాల్సిన విషయమన్నారు. ఈ వేడుకల ద్వారా నిధుల సేకరణ కూడా చేస్తామన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న 'మా' సభ్యుల బాగోగుల కోసం ఈ నిధులను ఉపయోగిస్తామని చెప్పారు.



'భరతనాట్యం' పెద్ద విజయం ఖాయం

'భరతనాట్యం' సినిమా పెద్ద విజయాన్ని సొంతం చేసుకోవటం ఖాయమని రచయిత కోన వెంకట్ అన్నారు. పిఆర్ ఫిలింస్ పతాకంపై పాయల్ సరాఫ్ ఈ సినిమాను నిర్మించారు. సూర్యతేజ ఏలే హీరోగా, మీనాక్షి గోస్వామి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం నాడు థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో సూర్యతేజ ఏలే, దర్శకుడు కెవిఆర్ మహేంద్ర, మీనాక్షి గోస్వామి మాట్లాడారు.

జూన్‌లో 'డబుల్ ఇస్మార్ట్'?



పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రామ్ పోతినేని నటించిన చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ చిత్రాన్ని మొదట ఈనెల 8న విడుదల చేయాలని చిత్ర బృందం వెల్లడించింది. షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావటంతో వాయిదా వేశారు. తాజాగా హీరో రామ్ జూన్‌లో విడుదల చేస్తామని ప్రకటించారు. అప్పటికి ఎన్నికల హడావుడి అంతా అయిపోతుందని, అందుకే జూన్‌లోనే విడుదల చేయాలని నిర్ణయించామని తెలిపారు.

ఆరోగ్యం, ఆనందం, డబ్బు చాలా ముఖ్యం

జీవితంలో ఎవ్వరికైనా ఆరోగ్యం, ఆనందం, డబ్బు ఈ మూడు చాలా ముఖ్యమని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిఎఫ్‌జెఎ) ఆధ్వర్యంలో హెల్త్‌కార్డ్, డైరీ, ఐడి కార్డుల పంపిణీలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టులందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చూడాలని తెలంగాణా ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డికి విజ్ఞప్తిచేశారు. విజయ్ ప్రస్తుతం 'ఫ్యామిలీస్టార్' సినిమాలో నటిస్తున్నారు. మృణాల్‌ఠాకూర్ హీరోయిన్. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై పరశురామ్ తెరకెక్కిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది.



కర్రన్ కేక...

ఢిల్లీపై నాలుగు వికెట్ల తేడాతో పంజాబ్ గెలుపు



సామ్ కర్రన్ (63పరుగులు)

ఛండీగడ్ : ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17 తొలి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్ సత్తా చాటింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి పంజాబ్ బోణీ కొట్టింది. ఆల్‌రౌండర్ సామ్ కరన్(63) అర్ధ సెంచరీకి తోడు.. లివింగ్ స్టోన్(38నాటౌట్) ఆఖరి దాకా నిలబడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. సామ్ కరన్‌తో జతకలిసిన లివింగ్‌స్టోన్ ఐదో వికెట్‌కు 67 పరుగులు జోడించాడు. ఢిల్లీ నిర్దేశించిన 175 పరుగుల ఛేదనలో పంజాబ్ కెప్టెన్ శిఖర్ ధావన్(22), ఇంపాక్ట్ ప్లేయర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(26)లు స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. అయితే.. వందకే నాలుగు వికెట్లు పడిన దశలో సామ్ కరన్(63) లివింగ్‌స్టోన్(38 నాటౌట్)లు బౌండరీలతో ఢిల్లీపై విరుచుకుపడ్డారు. ఆఖరి ఓవర్‌లో పంజాబ్ విజయానికి 6 పరుగులు అవసరం కాగా.. సుమిత్ కుమార్ రెండు వైడ్స్ వేశాడు. నాలుగో బంతికి లివింగ్‌స్టోన్ భారీ సిక్సర్ బాది పంజాబ్‌ను గెలిపించాడు. ఢిల్లీ బౌలర్లలో కుల్దీప్ యాదవ్, ఖలీల్ అహ్మద్‌లు తలా రెండు వికెట్లు పడగొట్టారు. అంతకుముందు ఢిల్లీ క్యాపిటల్స్ ఇంపాక్ట్ ప్లేయర్ అభిషేక్ పొరెల్(31నాటౌట్; 10 బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు) మెరుపు బ్యాటింగ్‌తో జట్టుకు భారీ స్కోర్ అందించాడు. ఢిల్లీ టాప్ బ్యాటర్స్ షాయ్ హోప్(33), డేవిడ్ వార్నర్(29), అక్షర్ పటేల్(21)లు ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ సారథి రిషభ్ పంత్ 18 పరుగులకే వెనుదిరిగాడు. పంజాబ్ బౌలర్ల ధాటికి ఒకదశలో పంత్ సేన స్కోర్ 150 దాటడమే కష్టమనుకున్న పరిస్థితుల్లో అభిషేక్ విధ్వంసం సృష్టించాడు. హర్షల్ పటేల్ వేసిన 20వ ఓవర్‌లో ఐదు బంతుల్ని వరుసగా 4, 6, 4, 4, 6గా మలిచాడు. దాంతో ఢిల్లీ స్కోర్ 170 దాటింది. పంజాబ్ బౌలర్లలో హర్షల్ పటేల్ అర్ష్‌దీప్ సింగ్‌లు తలా రెండేసి వికెట్లు తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సామ్ కర్రన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు...


ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి)జితేశ్ శర్మ (బి)హర్షల్ పటేల్ 28, మిఛెల్ మార్ష్ (సి)రాహుల్ చాహర్ (బి)అర్ష్‌దీప్ సింగ్ 20, హోప్ (సి)హర్‌ప్రీత్ బ్రార్ (బి)రబడా 33, పంత్ (సి)బెయిర్‌స్టో (బి)హర్షల్ పటేల్ 18, రికీ బుయ్ (సి)జితేశ్ శర్మ (బి)హర్‌ప్రీత్ బ్రార్ 3, స్టబ్స్ (సి)శశాంక్ సింగ్ (బి)రాహుల్ చాహర్ 5, అక్షర్ పటేల్ (రనౌట్) త్యాగరాజన్/జితేశ్ శర్మ 21, సుమిత్ కుమార్ (సి)జితేశ్ శర్మ (బి)అర్ష్‌దీప్ సింగ్ 2, అభిషేక్ పోరెల్ (నాటౌట్) 32, కుల్దీప్ యాదవ్ (రనౌట్) శశాంక్ సింగ్/హర్షల్ పటేల్ 1, అదనం 10. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 174పరుగులు. **వికెట్ల పతనం:** 1/39, 2/74, 3/94, 4/111, 5/111, 6/128, 7/138, 8/147, 9/174 **బౌలింగ్:** శామ్ కర్రన్ 1-0-10-0, అర్ష్‌దీప్ సింగ్ 4-0-28-2, రబడా 4-0-36-1, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-14-1, రాహుల్ చాహర్ 4-0-33-1, హర్షల్ పటేల్ 4-0-47-2

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (బి)ఇషాంత్ శర్మ 22, బెయిర్‌స్టో (రనౌట్) ఇషాంత్ 9, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)వార్నర్ (బి)కుల్దీప్ 26, శామ్ కర్రన్ (బి)ఖలీల్ అహ్మద్ 63, జితేశ్ శర్మ (స్టంప్) పంత్ (బి)కుల్దీప్ 9, లివింగ్‌స్టోన్ (నాటౌట్) 38, శశాంక్ సింగ్ (సి)పంత్ (బి)ఖలీల్ అహ్మద్ 0, హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 2, అదనం 8. (19.2ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 177పరుగులు. **వికెట్ల పతనం:** 1/34, 2/42, 3/84, 4/100, 5/167, 6/167 **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 4-0-43-2, ఇషాంత్ శర్మ 2-0-16-1, మిఛెల్ మార్ష్ 4-0-52-0, అక్షర్ పటేల్ 4-0-25-0, కుల్దీప్ 4-0-20-2, సుమిత్ 1.2-0-19-0.

గెలుపు ముంగిట సన్‌రైజర్స్ బోల్తా

క్లాసెన్ విధ్వంస ఇన్నింగ్స్ వృథా

కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో నాలుగు పరుగుల తేడాతో అనూహ్య ఓటమి



రస్సెల్ (64నాటౌట్) 25బంతుల్లో 3ఫోర్లు, 7సిక్సర్లు)

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ జట్టు అనూహ్యంగా ఓటమిపాలైంది. చివరి ఓవర్లో 13పరుగులు చేస్తే సన్‌రైజర్స్‌కు గెలుపు ఖాయం అనుకున్న దశలో కోల్‌కతా బౌలర్ హర్షిత్ రాణా వేసిన తొలి బంతిని క్లాసెన్ సిక్సర్ కొట్టి సన్‌రైజర్స్‌కు గెలుపు తీరాలకు చేర్చాడు. ఆ తర్వాత బంతికి క్లాసెన్ ఒక పరుగు తీయగా.. మూడో బంతికి షాబాజ్ అహ్మద్ ఔటయ్యాడు. చివరి మూడు బంతుల్లో 6పరుగులు చేయాల్సిన దశలో క్రీజ్‌లోకి వచ్చిన జాన్సెన్ ఒక పరుగు తీయగా.. ఆ తర్వాత బంతికి క్లాసెన్ ఔటవ్వడంతో ఫలితం తారుమారైంది. ఇక చివరి బంతికి గెలుపుకు 5పరుగులు చేయాల్సి ఉండగా.. హర్షిత్ వేసిన చివరి బంతి సన్‌రైజర్స్ కెప్టెన్ కమిన్స్ బ్యాట్‌కు తగలలేదు. దీంతో సన్‌రైజర్స్ అనూహ్యంగా ఓటమిపాలవ్వగా.. కోల్‌కతా 4పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆండీ రస్సెల్‌కు లభించింది. అంతకుముందు ఆండీ రస్సెల్ బ్యాట్‌నుంచి సిక్సర్లు మోత మోగడంతో సన్‌రైజర్స్‌పై కోల్‌కతా జట్టు 208పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. ఓపెనర్ సాల్ట్(54) రాణించినా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్స్ నిరాశపరచడంతో కోల్‌కతా జట్టు ఓ దశలో 51పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో రమణ్‌దీప్(35) జత కలవడంతో సాల్ట్-రమణ్ దీప్ 5వ వికెట్‌కు 54పరుగులు జతచేశారు. ఆ తర్వాత వీరిద్దరూ వెంట వెంటనే ఔటయ్యాక ఆండీ రస్సెల్(64నాటౌట్; 25బంతుల్లో 3ఫోర్లు, 7సిక్సర్లు)కి తోడు రింకు సింగ్(23; 15బంతుల్లో 3ఫోర్లు) 7వ వికెట్‌కు 81పరుగులు జతచేశారు. కోల్‌కతా జట్టు చివరి 30 బంతుల్లో 85పరుగులు జతచేసి భారీస్కోర్‌ను దోహదపడ్డారు. సన్‌రైజర్స్ బౌలర్లు నటరాజన్‌కు మూడు, మార్కండేకు రెండు, కమిన్స్‌కు ఒక వికెట్ దక్కాయి.

ఐపిఎల్‌లో నేడు

రాజస్తాన్ × లక్నో
(వేదిక: జైపూర్; మ.3.30గం॥లకు)
గుజరాత్ × ముంబయి
(వేదిక: అహ్మదాబాద్; రా.7.30గం॥లకు)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68